ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 162 ఆదివారం 31 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-
Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 162 Sunday 31 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## నాలుగు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ముషీరాబాద్ బీఆర్ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌లో పాల్గొన్న కేటీఆర్
- గ్రామాల్లో జనాలు కాంగ్రెస్ ను దారుణంగా తిడుతున్నారని వ్యాఖ్య
- కరెంటు కూడా సరిగా ఇవ్వడం లేదని విమర్శ

**వార్త సంధ్య, హైదరాబాద్, మే 30 :**
తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ సెగలు మరింత రాజుకున్నాయి. ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ మెంబర్‌షిప్ - మిగతా 2 లో

## మోటార్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్
- ఉచిత విద్యుత్ కొనసాగిస్తే బీఆర్ఎస్ ఎన్నికల నుంచి తప్పుకుంటుందా అని ప్రశ్న
- కేసీఆర్ రైతుల ముసుగులో రాజకీయ లబ్ది కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శ




**వార్త సంధ్య, హైదరాబాద్, మే 30 :**
బీఆర్ఎస్‌కి సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్ కొనసాగిస్తే బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ రైతుల ముసుగులో రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నామని, ఉచితంగా అందిస్తున్న విద్యుత్ - మిగతా 2 లో


2 లో

## నన్ను జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందాలనుకుంటున్నారు

- బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్
- తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తతల మధ్య బాల్క సుమన్ అరెస్ట్
- పోలీసులను అడ్డుకుని, నినాదాలు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలు
- ఇది కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపేనన్న బాల్క సుమన్


2 లో

## దేశరక్షణ కోసం 'ధర్మ హింస' అవసరమే

- ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్
- కేవలం అహింసతోనే సమస్యలు పరిష్కారం కావన్న ఆదిత్యనాథ్
- దేశాన్ని, ధర్మాన్ని కాపాడేందుకు ధర్మ హింస కూడా అవసరమేనని వ్యాఖ్య
- సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచన


2 లో

## ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు
- సీయూఈటీ యూజీ 2026 పరీక్షలో సాంకేతిక లోపం
- పలు కేంద్రాల్లో రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభం
- సమస్యను పరిష్కరించామని, అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ప్రకటన

## కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్



- జూన్ 3న డీకే ప్రమాణస్వీకారం
- స్వయంగా ప్రకటించిన కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్
- మాజీ సీఎం సిద్ధరామయ్య డీకే పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా సమర్థించారు
- కేవలం పది నిమిషాల్లోనే సీఎల్పీ భేటీ ముగియడం గమనార్హం

**వార్త సంధ్య, బెంగళూరు , మే 30 :**
కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పగ్గాలు చేపట్టనున్నారు. శనివారం సాయంత్రం బెంగళూరులో జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ సీఎం సిద్ధరామయ్య డీకే పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా - మిగతా 2 లో

### రాజస్థాన్‌లో భారీ ఇసుక తుపాను...
## పట్టపగలే చీకట్లు!



- రాజస్థాన్‌లోని పలు జిల్లాలను ముంచెత్తిన ఇసుక తుఫాను
- చురు, బికనీర్, శ్రీ గంగానగర్‌పై తీవ్ర ప్రభావం
- అరగంట పాటు దట్టమైన ధూళితో అంధకారంగా మారిన వాతావరణం
- పశ్చిమ అలజడుల కారణంగానే ఈ తుఫానులు అని వెల్లడి
- ప్రస్తుతానికి ప్రాణనష్టంపై ఎలాంటి సమాచారం లేదు

**వార్త సంధ్య, రాజస్థాన్, మే 30 :**
రాజస్థాన్‌లోని పలు జిల్లాలను శనివారం శక్తిమంతమైన ఇసుక తుపాను ముంచెత్తింది. దట్టమైన ధూళి మేఘాలు ఆకాశాన్ని కమ్మేయడంతో వాతావరణం ఒక్కసారిగా అంధకారంగా మారింది. ఇసుక తుపాను అనంతరం భారీ వర్షం కురిసింది. - మిగతా 2 లో

## జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్

- నాయుడుపేటలోని జిందాల్ ప్లాంట్‌లో చెత్త నుంచి విద్యుత్ తయారీ
- ఉత్పత్తి, వ్యయం తదితర వివరాలను తెలుసుకున్న పవన్ కల్యాణ్
- కాకినాడ జిందాల్ ప్లాంట్ పై ఆరా తీసిన డిప్యూటీ సీఎం



**వార్త సంధ్య, అమరావతి, మే 30 :**
ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నెల్లూరు జిల్లా నాయుడు పేటలోని జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' (చెత్త నుంచి విద్యుత్ తయారుచేసే) ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్ నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు.ప్లాంట్ ప్రతినిధులతో - మిగతా 2 లో

## ఖరీఫ్ సాగునీటి సరఫరాపై కీలక నిర్ణయాలు


- రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్!
- మే 31 నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు నీరు విడుదల చేయాలని నిర్ణయం
- సాగునీటికి రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామన్న దుర్గేష్
- నాట్లు వేసుకునేందుకు రైతులు సిద్ధం కావాలని సూచన



**వార్త సంధ్య, అమరావతి, మే 30 :**
ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి సరఫరాను క్రమబద్ధీకరించేందుకు నీటిపారుదల సలహా మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో - మిగతా 2 లో

## తెలుగువారు ఎక్కడ ఉన్నా తెలుగుజాతి ఒక్కటే


- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- తెలుగుదేశం పార్టీ పుట్టిందే తెలంగాణ గడ్డపై
- టీడీపీ ఆవిర్భావం తరువాత తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయి
- తెలుగుదేశం ప్రకటించిన మహిళలకు 33 శాతం
- రిజర్వేషన్ దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది



**వార్త సంధ్య, అమరావతి, మే 30 :**
చంద్రబాబు ప్రాంతీయ కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. అబద్ధాలతో మైండ్ గేమ్ ఆడే గొడ్డలి పార్టీ పట్ల పూర్తి అప్రమత్తంగా ఉంటూ, వారి కుట్రలను సమర్థంగా తిప్పికొట్టాలని దిశానిర్దేశం చేశారు. ప్రాంతీయ కోఆర్డినేటర్లు తమ తమ నియోజకవర్గాల పరిధిలోని క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జగన్ కుటిల రాజకీయాలను క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడ ఎండగట్టాలని చంద్రబాబు స్పష్టంచేశారు.ఏపీతో పాటు ఈసారి తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మహానాడు బాగా జరిగిందని నేతలు, చంద్రబాబుకు వివరించారు. మహానాడు కార్యక్రమంలో తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు చేసిన వ్యాఖ్యలు సరికాదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.ఎంతో చరిత్ర, - మిగతా 2 లో

# సంపాదకీయం

## క్వాడ్‌లో మళ్లీ చలనం



ఉందో, ముగిసిపోయిందో తెలియని స్థితిలో ఏడాదిగా దారీతెన్నూ లేకుండా ఉండిపోయిన చతుర్భుజ కూటమి(క్వాడ్)లో ఎందుకనో కొంత చలనం వచ్చింది. మంగళవారం సభ్య దేశాలైన భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రుల సమావేశం జరగటం, చివరిలో ఒక ఉమ్మడి ప్రకటన వెలువడటం ఆర్నెల్ల ముందు కూడా ఊహాకందనిది. ఎందుకంటే నిరుడు జనవరిలో రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మిత్రులు, శత్రువులన్న విచక్షణ మరిచి అందరితో గిల్లికజ్జాలకు దిగడం మొదలెట్టారు. నిర్విచక్షణగా సుంకాలు విధిస్తూ అందరినీ సమానంగా ఇబ్బందిపెట్టారు. ఇలాంటి స్థితిలో అమెరికా చొరవతో ఏర్పడ్డ క్వాడ్ ఇక ముగిసిన అధ్యాయమని అందరూ అనుకున్నారు. నిజానికి ఆరంభంనుంచి క్వాడ్ ఏదో కారణంతో అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటూనేవుంది. చైనాకు వ్యతిరేకంగా 2007లో తొలి సమావేశం జరుపుకోగా ఆ మరుసటి ఏడాదికే జపాన్, ఆస్ట్రేలియాలు వైదొలగాయి. ఆ రెండుచోట్లా పాలకులు మారటం ఇందుకొక కారణం. 2008లో అప్పటి మన ప్రధాని మన్మోహన్ సింగ్ 'చైనాను కట్టడిచేసే ఎలాంటి కూటమిలోనూ భాగస్వాములం కాదల్చుకోలేదు' అని కుండబద్దలుకొట్టారు. దాంతో దాదాపు పదేళ్లపాటు అది అచేతనావస్థలో పడింది. 2017 నాటికి దక్షిణ చైనా సముద్రం, తూర్పు చైనా సముద్రం ప్రాంతాల్లో చైనా పెత్తనం పెరగటంతో ట్రంప్ చొరవ తీసుకుని దానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. అయినా కోవిడ్ కారణంగా తొలి శిఖరాగ్ర సమావేశం జరగటానికి నాలుగేళ్లు పట్టింది. కీలక ఖనిజాలు, ఇంధన భద్రత, సముద్రజలాల్లో ఇంటర్నెట్ కేబుల్స్ ఏర్పాటు, టెలికాం సాంకేతికత తదితర అంశాల్లో పరస్పరం సహకరించుకోవాలని విదేశాంగ మంత్రుల సదస్సు నిర్ణయించటం తాజా ప్రపంచ పరిణామాల పర్యవసానమే. హార్ముజ్ జలసంధి ప్రతిష్ఠంభన... ఇంధన సరఫరా నిలిచిపోవటం, ఆ ప్రాంతంవైపు నుంచి వచ్చే అండర్ సీ కేబుల్స్ సైతం ప్రమాదంలో పడటం వగైరా అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఆ ప్రాంతంలో నౌకలను అడ్డగిస్తున్న ఇరాన్ వైఖరిని, వచ్చే పోయే నౌకలవద్ద సుంకాలు వసూలు చేసే ఆలోచనను క్వాడ్ సమావేశం తప్పుబట్టింది. అనవసర యుద్ధంతో ఇంత వివాదానికి కారణమై, తాను సైతం హార్ముజ్‌ను దిగ్బంధించిన అమెరికాకు జనాంతికంగానైనా మిగిలిన దేశాలు హితవు పలికాయా అన్నది తెలియదు.చైనాను నిరోధించి, ఇండో-–పసిఫిక్ దేశాల భద్రతకు కృషిచేయాలని గతంలో చెప్పుకున్న సంకల్పం ఇప్పుడు తాత్కాలికంగా వెనక్కిపోయింది. ఈ ప్రాంతంలో నిఘా వ్యవస్థను పటిష్టం చేసి, ఎప్పటికప్పుడు క్వాడ్ దేశాలమధ్య సమాచారాన్ని ఇచ్చిపుచ్చు కోవాలని నిర్ణయించినా దీనర్థం క్వాడ్‌ను సైనికీకరణ చేయటం కాదని మన విదేశాంగ శాఖ వివరణనిచ్చింది. క్వాడ్ ఇంధన వేదికను ఈ ఏడాది ఆఖరులోగా నిర్వహించ బోతున్నామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో ప్రకటించారు. కానీ ఈ సంస్థ శిఖరాగ్ర సమావేశాలు ఎప్పుడో చెప్పకపోవటం సందేహాలకు తావిచ్చింది. విదే శాంగ మంత్రుల సమావేశంలోనే శిఖరాగ్ర తేదీలు ప్రకటించటం ఆనవాయితీ. వాస్తవా నికి అది 2024లోనే భారత్‌లో నిర్వహించాలి. కానీ వాయిదా పడింది. ఈలోగా సుంకాల వివాదం నేపథ్యంలో ట్రంప్ మన దేశం రావటానికి చొరవ చూపటం లేదు.క్వాడ్ మొదలయ్యే నాటికి చైనా దూకుడు మీదుంది. ముఖ్యంగా హిందూ సముద్ర ప్రాంత దేశాలమీదుగా అది ప్రారంభించదల్చుకున్న బెల్ట్ అండ్ రోడ్ ఇన్షియేటివ్ (బీఆర్ఐ) ప్రాజెక్టు భారత్ భద్రతకు ముప్పు తెస్తుందన్న సందేహం ఉంది. ఇక ఇరు దేశాల సరిహద్దుల్లో ఆ దేశం తరచు సృష్టించే వివాదాలు సరేసరి. ఇలాంటి నేపథ్యంలో క్వాడ్‌లో భాగస్వామ్యం కావటానికి మన దేశం ముందుకొచ్చింది. ఆనాటి పరిస్థితుల మాటెలావున్నా ఎవరికీ అంతుచిక్కని ట్రంప్ వంటి అధినేతను నమ్మి ముందుకెళ్లటం ఇప్పుడు సాధ్యమేనా? ఆయన చైనాతో సాన్నిహిత్యం కోసం తహతహలాడుతున్నారు. అది ఒక రూపం తీసుకుంటే క్వాడ్ కాడిపడేయరన్న గ్యారెంటీ ఏం లేదు. అందుకే రక్షణేతర రంగాల్లో భాగస్వామ్యం వరకూ ఫర్వాలేకున్నా, ఇతర విషయాల్లో మన దేశం ఆచితూచి అడుగేయక తప్పదు.

## దేశరక్షణ కోసం 'ధర్మ హింస' అవసరమే

**మొదటిపేజీ తరువాయి -** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దేశ భద్రత, అహింస, ధర్మరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు. లక్నోలో నిర్వహించిన 'నౌసేన శౌర్య వాటిక' ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ... అహింస మానవాళికి పరమ ధర్మమే అయినప్పటికీ, దేశానికి లేదా సమాజానికి ఎవరైనా ముప్పుగా మారినప్పుడు కేవలం అహింసతోనే సమస్యలు పరిష్కారం కావని స్పష్టం చేశారు. దేశాన్ని, ధర్మాన్ని కాపాడే క్రమంలో అవసరమైతే బలప్రయోగం లేదా 'ధర్మ హింస' చేయడం కూడా అంతే ముఖ్యమన్నారు.బలహీనులను ప్రపంచం ఎప్పుడూ గౌరవించదని, భద్రతాపరంగా శక్తివంతమైన దేశాలతోనే ఇతర దేశాలు స్నేహాన్ని కోరుకుంటాయని యోగి పేర్కొన్నారు. శాంతిభద్రతలు సజావుగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని చెబుతూ.. 2017కు ముందు యూపీలో మాఫియా ఆధిపత్యం, నేరాలు ఎక్కువగా ఉండేవని, బీజేపీ పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా మెరుగయ్యాయని గుర్తుచేశారు. దేశ సరిహద్దుల్లో అహర్నిశలు శ్రమిస్తూ భారతదేశాన్ని కాపాడుతున్న సైనికుల త్యాగాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని సీఎం యోగి ఆదిత్యనాథ్ పిలుపునిచ్చారు.

## మోటార్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయం


**మొదటిపేజీ తరువాయి -** వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నామని అన్నారు. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందని వెల్లడించారు.

## నాలుగు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు



**మొదటిపేజీ తరువాయి -** డ్రైవ్‌లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వంపై తనదైన శైలిలో విమర్శల జడివాన కురిపించారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు మాట్లాడిన మాటలను గుర్తుచేస్తూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కాంగ్రెస్ వస్తే రైతుబంధు నిలిచిపోతుందని గతంలో కేసీఆర్ చెబితే.. 'మేమేమన్నా దీవానాగాళ్లమా.. మాకు ధిమాక్ లేదా' అని ఒకాయన మాట్లాడారు. మరి ఇవాళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా, ఇప్పటికే నాలుగుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారు. మరి ఇప్పుడు నిన్ను దీవానాగాడు అంటే తప్పా? ధిమాక్ లేనోడు అంటే తప్పా?" అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలు తాను తిట్టిన తిట్ల కంటే ఎక్కువగా కాంగ్రెస్ నేతలను తిడుతున్నారని, ఎక్కడైనా దొరికితే తన్నేలా ఉన్నారని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో వడ్లు కొనడం లేదని, యూరియా ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతులు కష్టపడి పంట పండిద్దామంటే అటు రైతుబంధు వేయడం లేదని, ఇటు కరెంట్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదని, గ్రామాల్లో రైతులు చెప్పలేని గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన జిల్లాల ప్రజలంతా ఇవాళ తిరుగుబాటు మూడ్‌లో ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎప్పుడెప్పుడు తరిమికొడదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

# తెలుగువారు ఎక్కడ ఉన్నా తెలుగుజాతి ఒక్కటే



**మొదటిపేజీ తరువాయి -** నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని చంద్రబాబు హితవు పలికారు. 'తెలుగువారు ఎక్కడ ఉన్నా తెలుగుజాతి ఒక్కటే. ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడకూడదు. తెలుగుదేశం పార్టీ పుట్టిందే తెలంగాణ గడ్డపై అని, తెలంగాణలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉంది. టీడీపీ ఆవిర్భావం తరువాత తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయి. తెలంగాణలో ఉత్సాహంగా మహానాడు నిర్వహించడంపై పార్టీ శ్రేణులకు అభినందనలు. మహానాడులో ఆమోదించిన 33 శాతం మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి' అని చంద్రబాబు నేతలకు దిశానిర్దేశం చేశారు.'పునర్విభజన, మహిళ బిల్లులను విడదీసి చూడాల్సిన అవసరం లేదు. ఈ రెండు బిల్లులు కలిపి వస్తేనే నారీమణులకు న్యాయం జరుగుతుంది. ఈ రెండు బిల్లులు దేశ రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొస్తాయి. తెలుగు దేశం ప్రకటించిన మహిళలకు 33 శాతం రిజర్వేషన్ దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు అన్ని పార్టీలు కూడా స్వాగతించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అతివలకు మొదటి నుంచి టీడీపీ అండగా ఉంది. నియోజకవర్గాల పునర్విభజనలో 2011 జనాభా లెక్కలైనా, తాజా జనాభా లెక్కలైనా దక్షిణాదికి నష్టం. అందుకనే ఉన్న స్థానాలను 50 శాతం పెంచితే న్యాయం జరుగుతుంది. దీనివలన ఎవరికి నష్టం ఉండదని' చంద్రబాబు స్పష్టం చేశారు.త్వరలో నాలుగు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ వెలువడనుంది. ఈ క్రమంలో రేస్‌లో ఉన్న ఆశావాహులు చంద్రబాబును కలిసి తమకు అవకాశం పరిశీలించాలని కోరారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలోనూ, సచివాలయంలోనూ, పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇలా ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ చంద్రబాబు, లోకేశ్‌ను కలిసి రాజ్యసభలో తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఇలా గత రెండు రోజుల్లో వర్ల రామయ్య, కంభం పాటి రామ్మోహన్ రావు, రెడప్పగారి శ్రీనివాసరెడ్డి, టీడీ జనార్దన్, చింతకాయల విజయ్, తిప్పేస్వామి తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

# కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్



**మొదటిపేజీ తరువాయి -** సమర్థించారు. దీంతో కర్ణాటక కాంగ్రెస్ సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఐసీసీ పరిశీలకులు ప్రకటించారు. అయితే కేవలం పది నిమిషాల్లోనే సీఎల్పీ భేటీ ముగియడం గమనార్హం.కర్ణాటక కొత్త ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రమాణస్వీకారోత్సవం జూన్ 3న జరగనుంది. ఈ విషయాన్ని కర్ణాటక కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జీసీ చంద్రశేఖర్ ప్రకటించారు. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారోత్సవం లోక్‌భవన్‌లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం నిరాడంబరంగా నిర్వహించాలనే ఉద్దేశంతోనే సీఎం ప్రమాణస్వీకారోత్సవ వేదికను లోక్‌భవన్‌కు మార్చినట్లు చంద్రశేఖర్ చెప్పారు. ట్రాఫిక్ రద్దీ తలెత్తకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు ఎవరు కూడా లోక్‌భవన్‌కు రావద్దన్నారు. పార్టీ నిర్ణయానికి అందరూ సహకరించాలని చంద్రశేఖర్ కోరారు.కాగా, డీకే శివకుమార్ ఈ రోజు ఉదయం లోక్‌భవన్‌లో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్‌తో భేటీ అయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపైనే వీరిద్దరి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఎందుకంటే, గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ ఆదివారం ధర్మస్థలలో జరిగే ఉపరాష్ట్రపతి పర్యటనకు హాజరుకావాల్సి ఉంది. ఇందుకోసం ఆయన ఈ రోజే బెంగళూరు వెళ్తున్నారు. గవర్నర్ అందుబాటులో ఉండరనే ఉద్దేశంతోనే, సీఎల్పీ సమావేశానికి ముందే డీకే ఆయనతో భేటీ అయినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.శివకుమార్ సీఎం అయ్యాక, కొత్త మంత్రి వర్గంలో సిద్ధరామయ్య కుమారుడికి చోటు దక్కే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఎందకంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం ఢిల్లీ వెళ్లిన సిద్ధరామయ్య, కొత్త క్యాబినెట్‌లో తన తరఫున మంత్రుల జాబితాను పార్టీ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ పరిశీలన కోసం అందించారు. అందులోనూ తన కుమారుడు, ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్రకు ఉపముఖ్యమంత్రి పదవితోపాటు, కీలక శాఖలు కేటాయించాలని ప్రత్యేకంగా కోరినట్లు తెలుస్తోంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, సిద్ధరామయ్య ప్రభుత్వంలోని మంత్రుల్లో దాదాపు సగం మందికి కొత్త మంత్రివర్గంలో చోటు దక్కకపోవచ్చని సమాచారం. కర్ణాటక కాంగ్రెస్ సర్కార్‌పై బీజేపీ ఎంపీ, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై శనివారం విమర్శల వర్షం కురిపించారు. కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేయడం వల్ల సామాన్య ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. అసలు రాష్ట్రంలో అర్థవం తమైన మార్పు వచ్చే అవకాశమే లేదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కర్ణాటక భారీ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆరోపించారు. సరైన పాలన లేకపోవడం, అభివృద్ధి శూన్యం కావడం వల్ల ప్రజల్లో, ముఖ్యంగా ఓబీసీ సామాజిక వర్గంలో తీవ్ర నిరాశ నెలకొందన్నారు. వారి అసంతృప్తి భవిష్యత్ ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తుందని జోస్యం చెప్పారు."ప్రస్తుతం రాష్ట్రం భారీ రుణాల భారంతో కొట్టుమిట్టాడుతోంది. సుపరిపాలన, అభివృద్ధి లేక ప్రజల్లో నైరాశ్యం అలముకుంది. ప్రజలు, ప్రత్యేకించి ఓబీసీ వర్గం నిరంతరం నిరాశకు గురవుతున్నారు. అది ప్రభావం వచ్చే ఎన్నికల్లో కనిపిస్తుంది" అని బొమ్మై హెచ్చరించారు. సిద్ధరామయ్య మే 28న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత, కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పు, సంస్థాగత పునర్వ్యవస్థీకరణ జరుగుతున్న తరుణంలో బొమ్మై ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.కాగా, సిద్ధరామయ్య రాజీనామాను గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ ఆమోదించడంతో పాటు మంత్రిమండలిని కూడా రద్దు చేశారు. అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తయ్యే వరకు సిద్ధరామయ్యను ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరారు. కాగా ఈ రోజు సాయంత్రం జరగనున్న సీఎల్‌పీ సమావేశంలో డీకే శివకుమార్‌ను లాంఛనగా ముఖ్యమంత్రిగా ఎన్నుకునే అవకాశం కనిపిస్తోంది. ఇది కాస్త సజావుగా సాగితే, ఆ తర్వాత రాజ్యసభ నామినేషన్లు, ఎమ్మెల్సీ పదవులతో సహా కీలక నియామకాలను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది.

## జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్



**మొదటిపేజీ తరువాయి -** మాట్లాడిన పవన్ కల్యాణ్.. చెత్త నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి అవుతున్న వ్యయం, ప్లాంట్ రోజువారీ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉత్పత్తి అవుతున్న విద్యుత్ ఎంత? అలాగే యూనిట్ విక్రయ ఛార్జీల వివరాలు ఏంటి? అనే అంశాలను ప్లాంట్ ప్రతినిధులు ఉపముఖ్యమంత్రికి వివరంగా వివరించారు. ఈ పర్యటనలో కాకినాడలో నిర్మిస్తున్న జిందాల్ ప్లాంట్ ఆలస్యంపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాకినాడ జిందాల్ ప్లాంట్ ఇంకా ఎందుకు వినియోగంలోకి రాలేదని ఆయన ప్రశ్నించగా రాబోయే నవంబరు లోపు ఆ ప్లాంట్‌ను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని జిందాల్ ప్రతినిధులు డిప్యూటీ సీఎంకు హామీ ఇచ్చారు.పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా.. ఇటువంటి విద్యుత్ ప్లాంట్ల వల్ల పరిసర ప్రాంతాల్లో కాలుష్యం ఏ మేరకు పెరుగుతోంది, దాన్ని అదుపు చేయడానికి తీసుకుంటున్న జాగ్రత్తలు ఏమిటనే దానిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. దీనిపై జిందాల్ ప్రతినిధులు స్పందిస్తూ.. కాలుష్య నియంత్రణ మండలి ఏడాదికి నాలుగుసార్లు ప్లాంట్‌ను పరిశీలించి నివేదిక ఇస్తోందని ఉపముఖ్యమంత్రికి వివరించారు.

## రాజస్థాన్‌లో భారీ ఇసుక తుపాను... పట్టపగలే చీకట్లు!



**మొదటిపేజీ తరువాయి -** ఈ తుపాను ప్రభావం చురు జిల్లాపై అధికంగా కనిపించగా, బికనీర్, శ్రీ గంగానగర్ జిల్లాల్లోనూ జనజీవనం అస్తవ్యస్తమైంది. సుమారు 30 నిమిషాల పాటు బలమైన ఈదురు గాలులతో కూడిన ఈ తుపాను బీభత్సం సృష్టించింది. ఈ గాలులకు ఇసుక భారీగా కొట్టుకొచ్చి రోడ్లు, నివాస ప్రాంతాలను కప్పేసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల రహదారులపై కొన్ని అడుగుల మేర ఇసుక పేరుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తుపాను సమయంలో దారి కనిపించక ప్రజలు భయాందోళనలకు గురయ్యారు.ప్రస్తుతం కొనసాగుతున్న పశ్చిమ అలజడుల ప్రభావం వల్లే ఈ ప్రాంతంలో తరచూ ఉరుములు, వర్షాలతో కూడిన ఇసుక తుపానులు ఏర్పడుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ తుపానుల వల్ల తీవ్రమైన ఎండల నుంచి కొంత ఉపశమనం లభించినప్పటికీ, రవాణా, విద్యుత్ సరఫరా వ్యవస్థలకు అంతరాయం కలుగుతోంది.శ్రీ గంగానగర్ వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలు దాటడం అక్కడి తీవ్ర పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ నష్టం గానీ, పెద్ద ఎత్తున ఆస్తి నష్టం గానీ జరిగినట్లు సమాచారం అందలేదని అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లోనూ బికనీర్, షెఖావతి ప్రాంతాల్లో ఇలాంటి వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు.

# ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు



**మొదటిపేజీ తరువాయి -** దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఇవాళ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ) 2026 పరీక్షలో సాంకేతిక లోపం తలెత్తింది. దీనివల్ల రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సమస్యను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ధృవీకరించింది. ఇంతకుముందు నీట్ (యూజీ) పరీక్ష లీకైంది. ఈ నేపథ్యంలో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. దేశాన్ని విశ్వగురువుగా మారుస్తున్నామని ప్రధాని చెబుతుంటారని, కానీ కనీసం ఒక్క పరీక్షను కూడా సజావుగా నిర్వహించడం లేదని విమర్శించారు. సర్వర్ లోపం కారణంగా కొన్ని పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన పరీక్షను సాయంత్రం 4 గంటలకు ప్రారంభించారు. విద్యార్థులను మధ్యాహ్నం 2:30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. సాంకేతిక సమస్యను పరిష్కరించామని, పరీక్ష సమయం కోల్పోయిన విద్యార్థులకు నష్టపరిహారంగా అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది.ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో జరిగిన ఇతర పరీక్షల వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "నీట్, సీబీఎస్ఈ, ఎస్సెస్సీ, ఈరోజు సీయూఈటీ. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థులు. కానీ ఒక్కదాన్నీ నిజాయితీగా నిర్వహించలేకపోయారు" అని ఆయన ఆరోపించారు. భారత్‌ను 'విశ్వగురువు'గా మారుస్తున్నామని చెబుతూనే, మరోవైపు ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని రాహుల్ మండిపడ్డారు. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలు, పారదర్శకత లోపంపై ఈ ఘటన మరోసారి ఆందోళనలను రేకెత్తించింది.

# నన్ను జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందాలనుకుంటున్నారు

**మొదటిపేజీ తరువాయి -** తనను జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ నిర్ణయిం చారని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. అరెస్ట్‌కు ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం తనపై రాజకీయ కక్ష సాధిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తనపై 250కి పైగా కేసులు పెట్టారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అదే తరహాలో వేధిస్తోందని అన్నారు.రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన సాగుతోందని విమర్శించారు. సింగరేణిలో వందల కోట్ల రూపాయల అవినీతి జరుగుతోందని ఆరోపించారు. తాను చట్టాన్ని గౌరవిస్తానని, పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తానని చెబుతూనే, నేతలను విచారణ పేరుతో వేధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు. తాను ఎక్కడకూ పారిపోలేదని, పార్టీ కార్యక్రమంలోనే ఉన్నానని తెలిపారు.బాల్క సుమన్ అరెస్టు చేసే సమయంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వద్ద శనివారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం కనిపించింది. అరెస్ట్‌ను బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకించడంతో పార్టీ కార్యాలయం వద్ద గందరగోళం ఏర్పడింది. బాల్క సుమన్ తెలంగాణ భవన్‌లో ఉన్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అయితే, పోలీసు లు లోపలికి వస్తుండగా బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనం తరం బీఆర్ఎస్ న్యాయవాదులతో చర్చలు జరిపిన పోలీసులు బాల్క సుమన్‌ను అరెస్ట్ చేస్తున్నట్లు తెలిపారు.



## ఖరీఫ్ సాగునీటి సరఫరాపై కీలక నిర్ణయాలు



ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించేందుకు కాలువలు తెరిచే తేదీలు, నీటి పంపిణీ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. మే 31వ తేదీ నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు కందుల దుర్గేష్ తెలిపారు. ప్రస్తుతం కాలువల మరమ్మతు పనులు కొనసాగుతున్నందున, పరిస్థితిని బట్టి దశలవారీగా వివిధ కాలువలకు నీటిని విడుదల చేస్తామని చెప్పారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతుల కోసం రూ. 148 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేసినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే గోదావరి నది కాలుష్య నివారణ కోసం రూ.100 కోట్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి ధన్యవాదాలు తెలుపుతూ మరో తీర్మానం ఆమోదించినట్లు చెప్పారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తుగా నాట్లు వేసుకునేందుకు సిద్ధం కావాలని మంత్రి సూచించారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



## తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాని విజయవంతం చేయండి:డాక్టర్ పిడమర్తి రవి







**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 30** : జూన్ 21 2026 ఇందిరా పార్కులో నిర్వహించ తలపెట్టిన ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం సన్నాక సమావేశంలో భాగంగా ఈరోజు మేడ్చల్ మెదక్ కామారెడ్డి నిజామాబాదులో పర్యటించిన పిడమర్తి రవి తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం పింఛన్ గుర్తింపు కార్డు ఇవ్వాలి అనే ప్రధాన డిమాండ్తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులందరూ జూన్ 21న వేలాదిగా తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

## దుమ్ముతో ముసురుకున్న బైపాస్ రోడ్..

**ప్రమాదాలకు నిలయంగా మారుతున్న మార్గం**

**లక్ష్మీదేవిపల్లి మండలంలో ప్రజల ఆవేదన**

**దుమ్ము మేఘాల్లో కనిపించని వాహనాలు**

**ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్న ప్రజలు**

**భారీ వాహనాల రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు**

**రోడ్డు పూర్తి చేయాలని స్థానికుల డిమాండ్**

**ప్రమాదాలు జరిగే ముందే అధికారులు స్పందించాలి**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 30 (వార్త సంధ్య) :** లక్ష్మీదేవిపల్లి మండలం లోని పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుంచి శేషగిరి నగర్, హేమచంద్రపురం రైల్వే ట్రాక్ మీదుగా వెళ్లే కా బైపాస్ రోడ్ ప్రస్తుతం దుమ్ముతో నిండిపోయి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ మార్గంలో భారీ వాహనాలు, లారీలు, టిప్పర్లు నిరంతరం రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డుపై దుమ్ము విపరీతంగా ఎగసిపడుతోంది. దుమ్ము కారణంగా ఎదురుగా లేదా వెనుక నుంచి వస్తున్న వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలు సందర్భాల్లో ప్రమాదాలు తప్పినట్లు స్థానికులు చెబుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై నీరు చల్లడం, దుమ్ము నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఫేస్‌బుక్ పరిచయం.. రూ.23 లక్షల టోకరా!

**సోషల్ మీడియా స్నేహం.. లక్షల నష్టం**

**సినిమా ఛాన్స్ అంటూ మహిళను బురిడీ కొట్టించిన కేటుగాడు**

**బ్యాంక్ ఖాతా వివరాలు ఇచ్చి చిక్కుల్లో పడిన బాధితురాలు**

**సైబర్ నేరగాళ్ల వలలో అమాయకులు**

**మణుగూరులో వెలుగుచూసిన భారీ సైబర్ మోసం**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 30 (వార్త సంధ్య) :** సోషల్ మీడియాలో ఏర్పడిన పరిచయం ఓ మహిళకు భారీ నష్టాన్ని మిగిల్చింది. మణుగూరుకు చెందిన ఓ మహిళ ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన వ్యక్తిని నమ్మి ఏకంగా రూ.23 లక్షలు కోల్పోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సమాచారం ప్రకారం, విశాఖపట్నానికి చెందిన ఎల్.వి. ప్రసాద్ అనే వ్యక్తి ఫేస్‌బుక్ ద్వారా బాధిత మహిళతో పరిచయం పెంచుకున్నాడు. కొంతకాలం స్నేహంగా మాట్లాడి నమ్మకం సంపాదించిన అనంతరం, "సినిమాల్లో అవకాశాలు కల్పిస్తాను" అంటూ మాయమాటలు చెప్పాడు. ఈ క్రమంలో మహిళ నుంచి బ్యాంక్ ఖాతా వివరాలు సేకరించిన నిందితుడు, ఆమె ఖాతాను దుర్వినియోగం చేసి భారీ మొత్తాన్ని కాజేశాడు. అనంతరం ఆ డబ్బుతో లగ్జరీ కారు కొనుగోలు చేసినట్లు సమాచారం. తన ఖాతాలో డబ్బు మాయమైన విషయం గుర్తించిన మహిళ వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వమే మాకు ఆదర్శనీయం

**కాంగ్రెస్ నియర్ నాయకులు పెరవేన లింగయ్య యాదవ్**



**మంథని, మే 30(వార్త సంధ్య) :** మీ నాయకత్వమే మాకు ఆదర్శమని, మీ నాయకత్వంలో పనిచేయడం మాకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరవేని లింగయ్య యాదవ్ అన్నారు. శనివారం మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా ఆయనను శాలువతో ఘనంగా సన్మానించారు. తండ్రి దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావు తనయులుగా ప్రజాసేవకే అంకితమైన మీ నాయకత్వం మంథని నియోజకవర్గానికి ఎంతో అవసరమన్నారు. ఈ ప్రాంతానికే కాకుండా యావత్ రాష్ట్ర ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తుండడం మాకు ఎంతో గర్వంగా ఉందన్నారు. మంథని పట్టణానికి అనేకమైన నిధులు తీసుకువస్తూ పేద నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తున్నారని ఆపద సమయంలో ఆసుపత్రుల్లో ఉన్నవారిని అక్కున చేర్చుకుంటున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, బండారి ప్రసాద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రజా ప్రతినిధులు, గ్రామ శాఖ అధ్యక్షులు, గ్రామ యూత్ అధ్యక్షులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మందులకు "నో స్టాక్"..

**బయట కొనుక్కోండి అంటూ రోగులకు సూచనలు!**

**మాతా-శిశు ఆరోగ్య కేంద్రంలో ఔషధాల కొరత పై రోగుల ఆవేదన**

**"నో స్టాక్"తో రోగుల నిరాశ**

**బయట మెడికల్ షాపులకు పరుగులు**

**పేదలకు పెరుగుతున్న వైద్య ఖర్చులు**

**ఆసుపత్రి సిబ్బంది వైఖరిపై విమర్శలు**

**విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**






**భద్రాద్రి జిల్లా బ్యూరో, (వార్త సంధ్య) :** పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం మాతా–శిశు ఆరోగ్య కేంద్రంలో వైద్యులు రాసిన మందులు ఆసుపత్రి మెడికల్ స్టోర్‌లో అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు మందులు రాసి ఇవ్వగా, వాటిని తీసుకోవడానికి మెడికల్ స్టోర్‌కు వెళ్లినప్పుడు "నో స్టాక్" అంటూ సిబ్బంది సమాధానం చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు. అంతేకాకుండా, అవసరమైన మందులను బయట ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నారని పలువురు రోగులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా లభించాల్సిన మందులు అందుబాటులో లేకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు అదనపు ఆర్థిక భారం భరించాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి చిన్న మందుకు కూడా బయట దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, ప్రభుత్వ వైద్య సేవల ఉద్దేశమే దెబ్బతింటోందని విమర్శిస్తున్నారు. కొంతమంది రోగులు ఈ విషయాన్ని సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా, "ఎక్కడైనా ఫిర్యాదు చేసుకోండి" అనే విధంగా నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆసుపత్రిలో మందుల సరఫరా, నిల్వల నిర్వహణపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు లేకపోవడం వెనుక కారణాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే విచారణ చేపట్టి, రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంటున్నారు.

## విధి విధానాలు,ఉద్యమకారుల సమాచార సేకరణ





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 30 :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో చైర్మన్ డా. కె. కేశవరావు అధ్యక్షతన సమావేశం అయ్యింది. కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి లు సంబంధిత ఉన్నతాధికారులతో జరిపిన ఈ సమావేశంలో విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన జీవో నెంబర్679 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిటీ సచివాలయంలో మొదటి సారి నేడు సమావేశమైంది. జూన్ 4వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనాడు ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని గుర్తించి ప్రభుత్వం సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని కమిటీ చైర్మన్ డా. కె. కేశవరావు తెలిపారు. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశలలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను కమిటీ ఆదేశించింది. ఉద్యమకారుల గుర్తింపు ప్రమాణాలు, జైలు శిక్షలు అనుభవించిన వారు, పలు పోలీస్ కేసుల నమోదు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, అడ్వకేట్ లు, విద్యార్థులు, ఆర్.టి.సి కార్మికులు, సింగరేణి కార్మికులు, వారందరిని గుర్తించి, సముచితంగా గౌరవించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం, అలాగే వారి సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరపున తగిన గౌరవం, గుర్తింపు అందేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని, సమాచార సేకరణలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ఉద్యమంలో పాల్గొన్న వారందరిని గుర్తించి సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, జి.ఎ.డి కార్యదర్శి రఘునందన్ రావు, జి.ఎ.డి ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపి రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## మంథనిలో ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు




**మంథని, మే 30(వార్త సంధ్య) :** మంథని పట్టణంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి వారి దేవాలయంలో జనహృదయనేత మంథని నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన సందర్భంగా శ్రీధర్ బాబు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని మంథని మండలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి మంత్రి పేరిట అర్చనలు చేయించారు. అనంతరం మంథని అంబేద్కర్ చౌరస్తాలో బాణసంచాలు కాల్చి, భారీ కేక్ కట్ చేసి, ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ, శుభాకాంక్షలు తెలుపుకున్నారు, పండుగ వాతావరణంలో వేడుకలు జరిపారు. అనంతరం ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు మరియు సిబ్బందికి పండ్ల పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో మంథని మున్సిపాలిటీలో భారీ కేక్ కట్ చేసి, ఒకరికొకరు తినిపించుకుంటూ, శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్ ఆధ్వర్యంలో మంథని బస్టాండ్ లో ప్రయాణికులకు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండలు మండిపోతున్న వేళ ప్రజలకు, ప్రయాణికులకు ఊరట కలిగించేందుకు దేవా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో మార్కెట్లో కేక్ కట్ చేసి, రైతులకు స్వీట్లు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు, మార్కెట్ యార్డ్ లో కూడా రైతులందరూ వైభవంగా పండుగ వాతావరణం ఏర్పడింది. మంథని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాదుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంథని మండలంలోని గాజులపల్లి గ్రామంలోని ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్, మంథని మున్సిపాలిటీ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుదుదుల వెంకన్న, పాక్స్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు శశిభూషణ్ కాచే, మాజీ ఎంపీపీ కొండ శంకర్, మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్, ఆర్టీఏ మెంబర్ మంథని సురేష్, మాజీ ఏఎంసి చైర్మన్ అజీమ్ ఖాన్, కౌన్సిలర్లు లైసెట్టి రజిత, ఎరుకల స్రవంతి మాట్లాడుతూ... ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, శ్రీధర్ బాబు తెలంగాణ రాష్ట్ర దిక్సూచి, విద్యావంతుడు, నిరంతరం రాష్ట్ర మరియు మంథని నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం అందించి ఒక ఇంటి పెద్దకొడుకు లాగా అయిండని, రోడ్లు, ప్రభుత్వ హాస్పిటల్స్, మౌలిక సదుపాయాలు కల్పించి, యువతకు ఉపాధి కల్పిస్తున్నారని, శ్రీధర్ బాబు ఇలాంటి జన్మదిన వేడుకలు నిండు నూరేళ్లు జరుపుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. నిరంతరం ప్రజాసేవలో తరిస్తూ, మంథని గడ్డను ప్రగతి పతంలో నడిపిస్తున్న మన ప్రియతమ నాయకులు దుద్దిల్ల శ్రీధర్ బాబు కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకురాలు, అన్ని విభాగాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**జూన్ 10న లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థుల ఎంపిక**

**1వ, 5వ తరగతుల్లో ప్రవేశం కొరకు జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి**




**పెద్దపల్లి జిల్లా ప్రతిని, మే 30( వార్త సంధ్య ) :** 2026-27 విద్యా సంవత్సరానికి గాను పెద్దపల్లి జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్) పాఠశాలల్లో 1వ తరగతి, 5వ తరగతుల్లో ప్రవేశం కొరకు జిల్లాకు చెందిన అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ నందు 1వ తరగతి (నాన్ రెసిడెన్షియల్) లో 70 సీట్లు, 5వ తరగతి (రెసిడెన్షియల్) లో 73 సీట్లు కేటాయించడం జరిగిందని ఆయన వివరించారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1,50,000/- లోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2,00,000/- లోపు ఉండాలని, 1వ తరగతి నాన్ రెసిడెన్షియల్ ప్రవేశం కోరే విద్యార్థులు 01.06.2020 నుండి 31.05.2021 మధ్య జన్మించి ఉండాలి, ఒక కుటుంబం నుండి ఒకరికి మాత్రమే ప్రవేశానికి అర్హత ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు ఫారాలను మే 16 నుండి జూన్ 05 వరకు జిల్లా కలెక్టర్ కాంప్లెక్స్ లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం నుండి పొందవచ్చును. పూర్తి చేసిన దరఖాస్తులను తగిన ధ్రువీకరణ పత్రాలతో (కులం, ఆదాయం, పుట్టిన తేదీ, ఆధార్ కార్డు మొదలైనవి) జతపరిచి జూన్ 06వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు అదే కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. వచ్చిన దరఖాస్తుల నుండి జూన్ 10న లాటరీ పద్ధతి ద్వారా సీట్ల కేటాయింపు నిబంధనల ప్రకారం ఎంపిక ప్రక్రియ జరుగుతుందని, ఇతర వివరాల కొరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో లేదా ఫోన్ నెంబర్లు 9014327045, 9989354155 నందు సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రామవరం డిస్పెన్సరీ మూసివేత కుట్రను యాజమాన్యం విరమించుకోవాలి

**వైద్యుల నియామకం చేపట్టకుండా ఆస్పత్రిని మూసివేయడం దుర్మార్గం**

**స్టాఫ్ లేరనే సాకుతో వందలాది కార్మిక కుటుంబాల ఆరోగ్యంతో ఆటలాడొద్దు**

**ఆస్పత్రిని తక్షణమే పునరుద్ధరించి, పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని నియమించాలి**

**సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కేంద్ర కమిటీ ప్రచార కార్యదర్శి వంగా వెంకట్**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 30 (వార్త సంధ్య) :** రామవరం సింగరేణి డిస్పెన్సరీ మూసివేత కుట్రను యాజమాన్యం తక్షణమే విరమించుకోవాలని, ఆస్పత్రిని పునరుద్ధరించాలని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రచార కార్యదర్శి వంగా వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం అయన మీడియాతో మాట్లాడుతూ రామవరం ప్రాంతంలో నివసిస్తున్న వందలాది మంది సింగరేణి కార్మికులు, మాజీ కార్మికులు, వారి కుటుంబాలతో పాటు కాంట్రాక్టు కార్మికులకు ఈ వైద్యశాల ఎంతో కాలంగా వైద్య సేవలు అందిస్తోందని, ఈ ఆస్పత్రిలో కొత్త వైద్యుల నియామకం చేపట్టకుండా, కేవలం ఇద్దరు స్టాఫ్‌తో మందులు ఇచ్చేలా యాజమాన్యం కుట్రపూరితంగా మార్చిందని మండిపడ్డారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగి పదవీ విరమణ పొందడంతో, కొత్తవారిని నియమించకుండా ఆస్పత్రిని ఏకంగా సీల్ చేయడం సరైంది కాదన్నారు. ఈ ఆస్పత్రిని మూసివేయడం వల్ల స్థానిక కార్మిక కుటుంబాలు చిన్నపాటి వైద్య సేవలకు సైతం సుదూర ప్రాంతంలోని ప్రధాన వైద్యశాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వారికి ఆర్థికంగా, శారీరకంగా తీవ్ర భారంగా మారుతుందని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం మొండివైఖరి వీడి తక్షణమే ఇక్కడ వైద్యులను, సిబ్బందిని నియమించి ఆస్పత్రిని యధావిధిగా కొనసాగించాలని, లేనిపక్షంలో కార్మికుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

## మంత్రి శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు



**మంథని, మే 30(వార్త సంధ్య) :** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా శనివారం శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీధర్ బాబు ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలను ఎదగాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, కౌన్సిలర్లు పెంటరి రాజు, మారుపాక నిహారిక, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ముస్కుల సురేందర్ రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్, మండల పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు పనకంటి చంద్రశేఖర్, పేరవేణి లింగయ్య యాదవ్, బండ కిషోర్ రెడ్డి తోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి: ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** గాంధీ భవన్ ప్రాంగణంలోని ఇందిరా భవన్‌లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం ఘనంగా జరిగింది. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ సెక్రెటరీ సచిన్ సావంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బండి రమేష్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బూత్ లెవెల్ ఏజెంట్లను, డివిజన్ అధ్యక్షులను, అనుబంధ సంఘాల కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి నుంచి కమిటీలను బలోపేతం చేయడం ద్వారానే కాంగ్రెస్ పార్టీ మరింత పుంజుకుంటుందని ఆమె స్పష్టం చేశారు. అనంతరం పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని సంస్థగతంగా బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఇందుకు సంబంధించి పలు సలహాలు, సూచనలను సమావేశంలో పంచుకున్నారు.కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకాలపై ఇప్పటికే ప్రత్యేక సమావేశాలు నిర్వహించామని తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌లకు త్వరలోనే అందజేస్తామని, పార్టీ బలోపేతానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, పార్లమెంట్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, ముఖ్యాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిరిహిల్స్ కాలనీలో అభివృద్ధి పనులపై ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హామీ.







**ఎల్బీనగర్ ప్రతినిధి, మే 30 (వార్త సంధ్య):** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సిరిహిల్స్ కాలనీలో నిర్వహించిన డ్రైనేజీ పనులు మరియు కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిసి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు.ముఖ్యంగా కాలనీలో సుమారు 500 మీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని,పలు ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్ల కొరత ఉన్నందున కొత్త లైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలంలో రహదారులు దెబ్బతినడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీవాసులు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి,సీనియర్ మహిళా నాయకురాలు మల్లీశ్వరిరెడ్డి,హయత్ నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్,కొసనం ధనలక్ష్మి వెంకట్ రెడ్డి,చంద్రారెడ్డి,రామచంద్రరెడ్డి,అనిల్ కుమార్,కెకెఎల్,సందీప్ మరియు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకన్న,గౌరవ అధ్యక్షులు రాజిరెడ్డి,జనరల్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి,ఉపాధక్షులు కరుణాకర్,కోశాధికారి ప్రసాద్,జాయింట్ సెక్రటరీ మురళి స్థానిక ప్రజాప్రతినిధులు,కాలనీ పెద్దలు మరియు నివాసితులు పాల్గొన్నారు.

## నూతన డీజీపీ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కూనంనేని

**రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ పై చర్చ**

**ప్రజలు స్వేచ్ఛగా జీవించే వాతావరణం కల్పించాలని ఆకాంక్ష**

**పోలీసు సేవలు మరింత సమర్థవంతంగా అందించాలని సూచన**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 30 (వార్త సంధ్య) :** తెలంగాణ రాష్ట్ర డీజీపీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్‌ను కొత్తగూడెం శాసనసభ్యులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని శాంతిభద్రతల పరిస్థితులు, ప్రజల భద్రత, పోలీసు వ్యవస్థ పనితీరు తదితర అంశాలపై వారు చర్చించారు. సీవీ ఆనంద్ నాయకత్వంలో తెలంగాణ పోలీసు శాఖ మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కూనంనేని ఆకాంక్షించారు. అలాగే రాష్ట్రంలో ప్రజలు భయభ్రాంతులు లేకుండా స్వేచ్ఛగా జీవించే పరిస్థితులు నెలకొల్పడంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.కె. జానిమియా తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**రెండు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ డిమాండ్**

**గ్రామీణ పంచాయతీరాజ్ అదనపు కమిషనర్ వి. రవీందర్ ఐఏఎస్‌కు వినతిపత్రం**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 30 (వార్త సంధ్య) :** రాష్ట్రంలోని గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. వెంకటరాజ్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామీణ పంచాయతీరాజ్ అదనపు కమిషనర్ వి. రవీందర్, ఐఏఎస్ కు వినతిపత్రం సమర్పించారు. గ్రామపంచాయతీ సిబ్బందికి గత రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. జీవో నెం.51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి పాత కేటగిరీల విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, సహజ మరణం సంభవిస్తే రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.30 వేల ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీల అవసరాలకు అనుగుణంగా కార్మికుల నియామకానికి అవకాశం కల్పించి, ప్రస్తుతం పనిచేస్తున్న వారందరికీ సమాన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. 8 గంటల పనిదినం, వారాంతపు సెలవులు, పండుగ సెలవులు, జాతీయ మరియు రాష్ట్ర ఆర్జిత సెలవులు అమలు చేయాలని సూచించారు. ట్రాక్టర్ డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించడంతో పాటు ట్రాక్టర్లకు బీమా చేయించాలని కోరారు. సంవత్సరానికి మూడు జతల యూనిఫామ్‌లు, బూట్లు, సబ్బులు, నూనె, గ్లౌజులు, బెల్లం సరఫరా చేయాలని, గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రెజరీల ద్వారా ప్రతినెలా వేతనాలు చెల్లించాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏఐటీయూసీ నాయకులు యెడల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్పష్టమైన విధి విధానాలు విడుదల చేసిన తర్వాతే హెల్త్ కార్డుల అమలు చేపట్టాలి

**- తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టి.యు.టి.ఎఫ్) డిమాండ్**



రామినేని వెంకటేశ్వర్లు
రాష్ట్ర అధ్యక్షులు



లచ్చుమల్ల వెంకన్న
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**హైదరాబాద్, వార్త సంధ్య:** ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల కోసం ప్రభుత్వం ప్రతిపాదించిన హెల్త్ కార్డుల పథకానికి సంబంధించి పూర్తి స్థాయి విధి విధానాలు ప్రకటించిన తర్వాతే అమలు చేపట్టాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టి.యు.టి.ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి లచ్చిమల్ల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు సంబంధించిన కీలక అంశంలో స్పష్టత లేకుండా హడావిడిగా అమలు దిశగా వెళ్లడం సరికాదన్నారు. హెల్త్ కార్డుల కోసం డేటా నమోదు ప్రక్రియకు ప్రభుత్వం గడువు విధించినప్పటికీ, పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పటివరకు వెల్లడించలేదని పేర్కొన్నారు. అందువల్ల డేటా ఎంట్రీ గడువును కనీసం జూన్ 30 వరకు పొడిగించాలని కోరారు. హెల్త్ స్కీమ్ ద్వారా ఏయే రోగాలకు చికిత్స అందిస్తారు, ఔట్ పేషెంట్ (ఓపీ) సేవలు ఉంటాయా లేదా, అత్యవసర చికిత్సల విధానం ఏమిటి, క్యాన్సర్, గుండె, కిడ్నీ, న్యూరో వంటి ఖరీదైన వ్యాధులకు పూర్తి స్థాయి క్యాష్‌లెస్ వైద్యం అందిస్తారా అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ పథకంలో భాగస్వామ్యం అయ్యే ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల జాబితాను జిల్లా వారీగా ప్రకటించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు సమీపంలో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో లేకపోతే పథకం ప్రయోజనం తగ్గిపోతుందని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించే ఆసుపత్రులను ఎంపిక చేసి సేవలు అందుబాటులో ఉంచాలని కోరారు. పూర్తి స్థాయి విధి విధానాలు ప్రకటించకముందే ఉద్యోగుల జీతాల నుంచి 1.5 శాతం కోత విధిస్తామని ప్రకటించడం సమంజసం కాదన్నారు. జీతం ఆధారంగా కాకుండా కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగా ప్రీమియం నిర్ణయించడం మరింత న్యాయసమ్మతమైన విధానమని అభిప్రాయపడ్డారు. భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే ఇద్దరి జీతాల నుంచీ కోత విధించకుండా ఒక కుటుంబానికి ఒకే ప్రీమియం విధానం అమలు చేయాలని సూచించారు. అలాగే ప్రతి సంవత్సరం డిపెండెంట్ల వివరాలు సవరించుకునే అవకాశం కల్పించాలని, కుటుంబ పరిస్థితుల మార్పులకు అనుగుణంగా సవరణలు చేసుకునే వెసులుబాటు ఉండాలని కోరారు. పెన్షనర్ల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక నిబంధనలు తీసుకురావాలని, వృద్ధులకు వైద్య సేవలు సులభంగా అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులు అదనపు బిల్లులు వసూలు చేయకుండా కఠిన పర్యవేక్షణతో పాటు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 24 గంటల టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమైతే అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సంప్రదింపులు జరిపి, అన్ని సందేహాలకు సమాధానాలు ఇచ్చి, పూర్తి స్థాయి విధి విధానాలు విడుదల చేసిన తర్వాత మాత్రమే హెల్త్ కార్డుల అమలు చేపట్టాలని టి.యు.టి.ఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. జూనియర్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు సీనియర్ ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకే విధంగా బేసిక్ పేలో 1.5 శాతం ప్రీమియం కోత విధించడం సరైన విధానం కాదన్నారు. సీనియర్ ఉద్యోగులు, పెన్షనర్లకు సాధారణంగా డిపెండెంట్ల సంఖ్య తక్కువగా ఉంటుందని, అందువల్ల కుటుంబంలో ఉన్న ఆధారిత సభ్యుల సంఖ్య ఆధారంగా ప్రీమియం నిర్ణయించడం ఉత్తమమైన మార్గమని ప్రభుత్వానికి సూచించారు.


## త్రేతాయుగం నాటి ముత్తంపేట శ్రీ వీరాంజనేయ స్వామి సన్నిధిలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఈ. ఉమారెడ్డి ప్రత్యేక పూజలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 30 ( వార్త సంధ్య ) : ముత్తంపేట, దోమకొండ:** కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం ముత్తంపేట గ్రామంలోని ప్రాచీన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయాన్ని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఈ. ఉమారెడ్డి దర్శించుకున్నారు. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించినట్లు స్థానికంగా విశ్వసించే స్వామివారి విగ్రహాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎంతో చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఈ క్షేత్రాన్ని దర్శించుకోవడం తనకు ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. స్వామివారి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఆలయ ఆధ్యాత్మిక వైభవాన్ని కొనియాడిన ఉమారెడ్డి, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు ఘన స్వాగతం పలికి, ఆలయ చరిత్ర, విశిష్టతలను వివరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరులో అవకతవకలపై విచారణ జరిపించండి

**సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్**



**హైదరాబాద్,మే 30 వార్త సంధ్య :** ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరవుతున్న రుణాలు, వాహన సబ్సిడీ రుణాలలో జరుగుతున్న అవకతవకలు, అవినీతి అక్రమా లపై విచారణ జరిపించి అర్హులైన ఎస్సీ నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే విధంగా చూడాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం అజయ్ కుమార్, బోగం విష్ణులతో కలిసి వారు మాట్లాడుతూ.. రుణాల మంజూరులో అర్హత కలిగిన ఎస్సీ నిరుద్యోగ యువతకు కాకుండా రాజకీయ పలుకుబడి, ఆర్థికవృద్ధి ఉన్న వారికి అధికారులు రుణాలను మంజూరు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రుణాలు మంజురు చేయించేందుకు దళారులు పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు ఇచ్చిన వారికే రుణాలు మంజూరవుతున్నాయే తప్ప అర్హులైన వారికి అందడం లేదని వారు పేర్కొన్నారు. సబ్సిడీ లోన్స్ ద్వారా వాహనాల కొనుగోలులో బోగస్ కోటేషన్లు, నకిలీ బిల్లులు, అక్రమ లావాదేవీలు జరుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని వారు తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులు పూర్తి జాబితా, ఎంపిక ప్రక్రీయ, మంజూరైన రుణాల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండటకపోవడంతో దరఖాస్తు చేసుకున్న యువత ఆందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో అమలుచేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అనర్హులకు వెళ్లుతుండటంతో ప్రభుత్వ లక్ష్యం నేరవేరక ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత చోటు చేసుకుంటుందన్నారు.

## సముద్రాలను ఏలిన భయంకరమైన డైనోసార్ ను గుర్తించిన శాస్త్రవేత్తలు



**8 కోట్ల ఏళ్ల కిందట జీవించిన సముద్రపు జీవికి గుర్తింపు**

**దీనికి టైలోసారస్ రెక్స్ అని పేరు పెట్టిన శాస్త్రవేత్తలు**

**సముద్రపు 'టి-రెక్స్'గా దీనికి పేరు వచ్చింది**

**పొడవులో భూమిపైని టి-రెక్స్‌ను మించిపోయింది**

**పదునైన దంతాలతో మాంసాన్ని చీల్చివేసేదని వెల్లడి**

సుమారు 8 కోట్ల ఏళ్ల కిందట సముద్రాలను ఏలిన ఓ భయంకరమైన జీవిని శాస్త్రవేత్తలు తాజాగా అధికారికంగా గుర్తించారు. దీనికి 'టైలోసారస్ రెక్స్' అని పేరు పెట్టారు. సముద్రంలో దీని ఆధిపత్యం కారణంగా దీన్ని "సముద్రపు టి-రెక్స్"గా అభివర్ణిస్తున్నారు. చివరి క్రెటేషియస్ కాలంలో ఇది సాగరాలను శాసించినట్లు అమెరికన్ మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీ తన సైంటిఫిక్ బులెటిన్‌లో ప్రచురించింది. ఈ సముద్రపు జీవి చూడటానికి భారీ కొమోడో డ్రాగన్ మాదిరిగా ఉండేదని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. దీనికి పదునైన రంపపు పళ్లు ఉండేవి. ఈ దంతాలతో మాంసాన్ని సులభంగా చీల్చివేసేది. అత్యంత శక్తివంతమైన దవడలు, మెడ కండరాల సాయంతో పెద్ద జీవులను సైతం ఇది సులభంగా వేటాడేది. ఇప్పటివరకు లభించిన అతిపెద్ద 'టైలోసారస్ రెక్స్' శిలాజం పొడవు ఏకంగా 43 అడుగులు (13.2 మీటర్లు). భూమిపై జీవించిన అతిపెద్ద టి-రెక్స్ ('స్యూ' శిలాజం) కంటే ఇది పొడవైంది కావడం విశేషం. టైలోసారస్ రెక్స్ అనేది 'మొససార్' కుటుంబానికి చెందిన సముద్ర సరీసృపం. ఇది ఉత్తర అమెరికా మధ్యలో ఉన్న 'వెస్టర్న్ ఇంటీరియర్ సీవే' అనే ప్రాచీన సముద్రంలో నివసించింది. దీని శిలాజాలు ఎక్కువగా టెక్సాస్‌లో లభించగా, అతిపెద్ద శిలాజం కాన్సాస్‌లో బయటపడింది. పెద్ద చేపలు, ఇతర సముద్ర జీవులు దీని ప్రధాన ఆహారం. భూమిపై జీవించిన టైరనోసారస్ రెక్స్‌కు, ఈ సముద్ర జీవికి ప్రత్యక్ష సంబంధం లేదు. ఇవి రెండూ వేర్వేరు కాలాల్లో జీవించాయి. అయితే, లాటిన్‌లో 'రెక్స్' అంటే 'రాజు' అని అర్థం. భూమిపై టి-రెక్స్ ఎలా తిరుగులేనిదో, సముద్రంలో ఇది కూడా అలాంటి ఆధిపత్యాన్ని ప్రదర్శించిందని చెప్పడానికే శాస్త్రవేత్తలు దీనికి ఆ పేరు పెట్టారు.

## చెరువు మధ్యలో కట్ట నిర్మించి.. రూ.5,500 కోట్ల భూకబ్జా కుట్రను భగ్నం చేసిన హైడ్రా

**హైదరాబాద్ శివారులోని ముష్కిన్ చెరువు కబ్జా యత్నం భగ్నం**

**చెరువు మధ్యలో నిర్మించిన అక్రమ కట్టను కూల్చివేసిన హైడ్రా**

**రెండు నెలల నోటీసు తర్వాత రంగంలోకి దిగిన అధికారులు**

**చెరువు సరిహద్దులకు కంచె వేసి పరిరక్షణ చర్యలు ప్రారంభం**



హైదరాబాద్ శివారు ప్రాంతంలో భారీ భూకబ్జా యత్నాన్ని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) అధికారులు భగ్నం చేశారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలోని పుప్పాలగూడ, నార్సింగి సమీపంలో ఉన్న ముష్కిన్ చెరువును ఆక్రమించుకునేందుకు కొందరు చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. సుమారు రూ.5,500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడారు. వివరాల్లోకి వెళితే, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ముష్కిన్ చెరువుపై కన్నేశారు. పేదలతో గుడిసెలు వేయించి, భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. గ్రామ రికార్డుల ప్రకారం 59.11 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువు మధ్యలో ఏకంగా మట్టితో కట్ట నిర్మించి, 34 ఎకరాలకు పైగా భూమిని కబ్జా చేసేందుకు ప్లాన్ చేశారు. ఈ విషయంపై దృష్టి సారించిన హైడ్రా అధికారులు, ఆక్రమణదారులకు రెండు నెలల క్రితమే నోటీసులు జారీ చేశారు. అయినా వారు ఖాళీ చేయకపోవడంతో శనివారం చెరువు మధ్యలో నిర్మించిన అక్రమ కట్టను, గుడిసెలను పూర్తిగా తొలగించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చెరువు సరిహద్దుల వెంబడి ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులను ప్రారంభించారు. నగరంలోని చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# గ్యాస్ బుక్ చేస్తే 3 వారాలు ఆగాల్సిందే

**సిలిండర్ల డెలివరీలో ఏజెన్సీల మాయ**

**గ్యాస్ వినియోగదారులకు తప్పని తిప్పలు**

**బుక్ చేసిన రెండు, మూడు వారాల తర్వాతే సిలిండర్ల డెలివరీ**

**డొమెస్టిక్ సిలిండర్ హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు డెలివరీ చేస్తున్నట్లు ఆరోపణలు**



హైదరాబాద్ నగరంలో వంట గ్యాస్ వినియోగదారులకు తిప్పలు ఇంకా తప్పడం లేదు. వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి సమస్యలు లేవని అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ ఏజెన్సీల తీరుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎల్పీజీ సిలిండర్ బుక్ చేసిన తర్వాత రెండు, మూడు వారాలైనా సరఫరా చేయడం లేదు. ఏజెన్సీల వద్దకు పలుమార్లు తిరిగితే తప్ప సిలిండర్ రాని పరిస్థితి ఉంది.గ్యాస్ బుక్ చేసుకున్న తర్వాత ఎలాంటి సమాచారం ఉండటం లేదు. రెండు వారాల తర్వాత అదీ నేరుగా వెళ్లి ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడితేనే సిలిండర్ వస్తోంది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరతను అవకాశంగా తీసుకుని డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులకు పలువురు డీలర్లు తెరతీశారు. బుక్ చేసుకున్న వారికి సీరియల్ నెంబరు ఆధారంగా డెలివరీ చేయాల్సి ఉన్నా కానీ ఆ నిబంధనను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గృహావసర సిలిండర్లను హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హాస్టళ్లకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో 33 లక్షల ఎల్పీజీ కనెక్షన్లు ఉన్నాయి. సగటున నిత్యం 70 వేల బుకింగ్‌లు అయ్యేవి. కానీ పశ్చిమాసియాలో యుద్ధం మొదలైన అనంతరం బుకింగ్‌లు పెరిగాయి. ఈ నేపథ్యంలో 25 రోజుల గడువు ముగిసిన వెంటనే బుక్ చేస్తుండటంతో రోజూ లక్షకు పైగా దాటుతున్నాయి.భరత్‌నగర్‌కు చెందిన ఎల్పీజీ వినియోగదారుడు గత నెల 27న సిలిండర్ కోసం బుక్ చేశారు. 3 వారాలైనా రాకపోవడంతో పలుమార్లు ఫోన్‌లో ఏజెన్సీని సంప్రదించేందుకు ప్రయత్నించినా ఫోన్లు పని చేయలేదు. చివరకు ఏజెన్సీ వద్దకు వెళ్లి సిలిండర్ రాలేదని ఫిర్యాదు చేస్తే రెండు, మూడు రోజుల్లో వస్తుందని చెప్పి ఈ నెల 23న పంపించారు.అత్యధిక గ్యాస్ ఏజెన్సీల్లో గతంలో ఉన్న ఫోన్ నెంబర్లు ఇప్పుడు పని చేయడం లేదు. ఫోన్ చేస్తే ఎంగేజ్ రావడం, లేదంటే తీయకపోవడం, అదీ కాదంటే ఫోన్ పని చేయకపోవడం సాధారణంగా మారింది. పలు గ్యాస్ ఏజెన్సీలు కొత్త ఫోన్ నెంబర్లను ఉపయోగిస్తున్నాయి. మరోవైపు దీనిని ఆసరాగా చేసుకొని గ్యాస్ కనెక్షన్ కేవైసీ అప్‌డేట్, ఎమర్జెన్సీ గ్యాస్ బుకింగ్ పేరుతో సైబర్ కేటుగాళ్లు సరికొత్త మోసాలకు పాల్పడుతున్నారు. అమాయకుల అకౌంట్స్‌ను ఖాళీ చేస్తున్నారు. ఈ మేరకు ఇటువంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ప్రజలను హెచ్చరిస్తున్నారు.డబ్బు చెల్లిస్తే గ్యాస్ వస్తుందంటూ సందేశాలు వస్తే వెంటనే సైబర్ మోసమని గ్రహించాలి. ఇలా గ్యాస్ బుకింగ్ లేదా కేవైసీ అప్‌డేట్‌ల కోసం గ్యాస్ కంపెనీల అధికారిక యాప్‌లు, వెబ్‌సైట్‌లను ఉపయోగించాలి. ఆ వివరాలు గ్యాస్ బిల్లులపై ఉంటాయని గమనించండి. ఏదైనా సందేశాలు ఉంటే నేరుగా వాటిని సంబంధిత గ్యాస్ ఏజెన్సీ ఆఫీస్‌కు వెళ్లి సంప్రదించండి. ఇలా సైబర్ మోసాలకు గురైతే ఆలస్యం లేకుండా వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబరు 1930కి కాల్ చేయండి. లేదా కేంద్ర ప్రభుత్వ అధికారిక పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.కేవైసీ అప్‌డేట్ చేయాలంటూ వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే గుర్తు తెలియని లింక్‌లను క్లిక్ చేయడం, వారు పంపే ఏపీకే ఫైల్స్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయడం అత్యంత ప్రమాదకరం. నేరగాళ్లు పంపే ఏ చిన్న యాప్ కూడా డౌన్‌లోడ్ చేయకూడదు. లేదంటే మీ మొబైల్ యాక్సిస్ మొత్తం వారి చేతుల్లోకి వెళ్లిపోతుంది. దీని ద్వారా ఫోన్‌కు వచ్చే

# రూ.1500 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాకు వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా యత్నం

**శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్ శ్రీనివాస్**

**గండిపేటలో రూ.1500 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం**

**కీలకంగా వ్యవహరించిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు**

**కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు**



హైదరాబాద్ శివార్లలోని భూముల ధరలకు రెక్కలు రావడంతో అక్రమార్కులు ప్రభుత్వ భూమిపై కన్నేసి కోర్టుకు సైతం నకిలీ డాక్యుమెంట్లు చూపించి రూ.1500 కోట్లకు పైగా ఉన్న ప్రభుత్వ భూమిని కాజేసేందుకు యత్నించారు. రంగారెడ్డి జిల్లా గండిపేటలో జరిగిన ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కీలకంగా వ్యవహరించడం కలకలం రేపుతోంది. ఆక్రమించుకున్న వారికి సహకరిస్తూ, ప్రభుత్వ భూమిని రెగ్యులరైజ్ చేయిస్తానంటూ హామీలు ఇచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు. నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు, ఫోర్జరీ పత్రాలు, రూ.కోట్ల లావాదేవీలతో సాగిన ఈ భూ దందాపై సైబరాబాద్ పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు, పరారీలో ఉన్న కీలక నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.రంగారెడ్డి జిల్లా గండిపేట గ్రామంలోని సర్వే నంబర్ 18లో 104.25 కుంటల ప్రభుత్వ భూమి ఉంది. 1954 నుంచి ఇది ప్రభుత్వ భూమిగానే ఉంది. అదే గ్రామానికి చెందిన నిమ్మల దశరథ్ కుటుంబసభ్యులు సుమారు 10 ఎకరాలు తమకే వస్తుందని చెప్పి ఆ స్థలాన్ని ఆక్రమించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ శాఖ అధికారులు అతడిని అక్కడి నుంచి ఖాళీ చేయించాలని భావించారు. దీంతో దశరథ్ కుటుంబసభ్యులైన నిమ్మల రాజేశ్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల రామస్వామి, మంగా, నాగేశ్వర్‌రావులు ఆ భూమి తమదేనని 2012లో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో ఉండగానే, రుద్రరాజు రామకృష్ణరాజు అనే మరో వ్యక్తికి దశరథ్ భూమిని అగ్రిమెంట్ చేశారు. దీంతో అక్కడ ఓ గదిని ఏర్పాటు చేసిన రామకృష్ణరాజు విజయవాడ నుంచి సునీల్ అనే వ్యక్తిని తీసుకొచ్చి అక్కడ ఇల్లు కట్టించి ఉంచాడు.కొన్నాళ్లకు అది ప్రభుత్వ భూమి అని తెలియడంతో దాన్ని వదులుకున్నాడు. సునీల్ అనే వ్యక్తికి కూడా రామకృష్ణరాజు అందుబాటులోకి రాలేదు. విషయం తెలుసుకున్న నిమ్మల కుటుంబం ఆ భూమిని తమ ఆధీనంలోనే ఉంచుకునేందుకు ప్రయత్నించారు. గతేడాది అక్టోబర్‌లో దశరథ్ కుటుంబసభ్యులు వేసిన రిట్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. అనంతరం అధికారులు అక్కడ ఉంటున్న సునీల్‌ను ఖాళీ చేయించి ఇల్లు కూల్చేశారు. ఇల్లు కూల్చివేసి ఖాళీ చేయించినా, నిందితులు భూమిపై కన్నేసే ఉంచారు. కొన్ని రోజుల నుంచి ఆ సర్వే నంబర్‌లోని 9.25 కుంటల భూమిని ప్రభుత్వం ఐదుగురికి ఇచ్చినట్లు జీవో కాపీలు ప్రత్యక్షం అయ్యాయి. గండిపేటకు చెందిన నిమ్మల రాజేశ్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల రామస్వామి, మంగా, నాగేశ్వర్‌రావు పేర్లపై జీవోలు వాట్సాప్ గ్రూప్‌లో ప్రచారం చేశారు.వీటిని గమనించిన గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు కోర్టు అనుమతితో నిమ్మల కుటుంబసభ్యుల ఇళ్లలో సోదాలు చేశారు. సోదాల్లో భాగంగా పలు కీలక డాక్యుమెంట్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గతేడాది అక్టోబర్ 30న అంటే కోర్టు రిట్ పిటిషన్‌ను కొట్టివేసిన కొన్ని రోజులకే నిమ్మల కుటుంబం బొల్లా రమేశ్ అనే వ్యక్తితో ఆ భూమి డెవలప్‌మెంట్ కింద రూ.3.5 కోట్లకు ఒప్పందం చేసుకున్నట్లు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ వినుకొండ మాజీ వైసీపీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆ భూమిని రెగ్యులరైజ్ చేపిస్తానని చెప్పాడని పోలీసులు వివరించారు.గండిపేటలోని భూమిని ప్రభుత్వం క్రమబద్ధీకరించిందంటూ నకిలీ జీవోలు సృష్టించి వాట్సాప్‌లో వైరల్ చేశారు. తహసీల్దార్ ఫిర్యాదుతో నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. నకిలీ పత్రాలు తయారు చేసిన వేణు గోపాల్, నిమ్మల రాజేశ్‌గౌడ్, సాయి కిరణ్‌లను అరెస్ట్ చేశాం. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు, బొల్లా రమేశ్ పరారీలో ఉన్నారు. బ్రహ్మ నాయుడి ఖాతా నుంచి రెండు విడతల్లో రూ.1.25 కోట్లు ట్రాన్స్‌ఫర్ అయినట్లు గుర్తించాం. బొల్లాపై నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశాం.సచివాలయంలో అసిస్టెంట్ కలెక్టర్‌నంటూ నమ్మించి : తన ఖాతా నుంచి నిమ్మల కుటుంబంలోని ఒక ఖాతాకు రూ.కోటి, మరో ఖాతాకు రూ.25 లక్షలు బదిలీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. మిగితా డబ్బు నిమ్మల కుటుంబంలోని మరికొందరికి బొల్లా రమేశ్ బదిలీ చేసినట్ల పోలీసులు తెలిపారు. ఈ మొత్తం వ్యవహారానికి రాధాకృష్ణ అనే వ్యక్తి మధ్యవర్తిత్వం చేసినట్లు గుర్తించారు. సూర్యాపేటకు చెందిన రాధాకృష్ణ అనే వ్యక్తి సచివాలయంలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేస్తున్నానని అందరినీ నమ్మించినట్లు వెల్లడించారు.ఈ కేసులో ఇప్పటి వరకు నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌లను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేశ్, సునీల్, రాధాకృష్ణ సహా మరికొందరిని పట్టుకునేందుకు నాలుగు పోలీస్ బృందాలు ఏర్పాటు చేసినట్లు డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు, ఫోర్జరీ భూ పత్రాలు, ధ్రువీకరణ లేని వాట్సాప్ సోషల్ మీడియా సందేశాలను నమ్మవద్దని సైబరాబాద్ పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు. భూముల కొనుగోలు లేదా లావాదేవీలకు ముందు సంబంధిత రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల వద్ద పూర్తి ధ్రువీకరణ చేసుకోవాలని కోరుతున్నారు.

# మద్యం ముడుపులతో రాజభోగాలు

మద్యం లంచాల సొమ్ముతో వైఎస్సార్సీపీ ముఠా రాజభోగాలు అనుభవించింది. విదేశాల్లో విలాసాల్లో మునిగి తేలింది. ఛార్టర్డ్ విమానాల్లో ప్రయాణాలు ఫైవ్ స్టార్ హోటళ్లలో జల్సాలు చేసింది. పబ్‌లు, క్లబ్బుల్లో అమ్మాయిలతో చిందులేసింది. ఆఫ్రికా దేశాల్లో పెట్టుబడులకు యత్నించింది. ముడుపుల రూపంలో వచ్చిన పెట్టెల కొద్దీ కరెన్సీ కట్టలను డెన్లలో భద్రపరిచింది. నిందితుడు కట్టా ప్రణోయ్ ప్రకాశ్ ఫోన్ ఫోరెన్సిక్ విశ్లేషణలో వైఎస్సార్సీపీ ముఠా బండారం వెలుగులోకి వచ్చింది. సమగ్ర నివేదికను సిట్ న్యాయస్థానానికి అందజేసింది.మద్యం కుంభకోణంలో రూ.వేల కోట్లు కొల్లగొట్టిన వైఎస్సార్సీపీ ముఠా ఆ లంచాల సొత్తుతో అత్యంత విలాసవంతమైన జీవితాన్ని అనుభవించింది. చార్టర్డ్ విమానాల్లో తిరుగుతూ, ఫైవ్ స్టార్ హోటళ్లలో గడుపుతూ జల్సాలు చేసింది. మద్యం లంచాల డబ్బుతో టాంజానియాలో ఇనుపఖనిజ కర్మాగారం, ఆఫ్రికా దేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రయత్నించింది. దాని కోసం ఆయా దేశాలను చుట్టేసింది. వైఎస్సార్సీపీ ముఠా విలాసాలు, దర్జాలు, రాజభోగాలు, లంచాల సొమ్ము భద్రపరిచిన కేంద్రాలు, వాటిలోని కట్టల కొద్దీ కరెన్సీ నోట్లు ఫోరెన్సిక్ నివేదిక సాక్షిగా బట్టబయలయ్యాయి.కేసులో నిందితుడు కట్టా ప్రణోయ్ ప్రకాశ్ ఫోన్‌లను సిట్ అధికారులు ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపించి విశ్లేషించగా చిత్రాలతో వైఎస్సార్సీపీ ముఠా బండారం బయటపడింది. మార్చి 2న ప్రణోయ్ ప్రకాశ్‌ను అరెస్ట్ చేసిన సిట్ అధికారులు అతని నుంచి 3 ఫోన్లు స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపించారు. ఆ నివేదికలను తాజాగా న్యాయస్థానానికి సమర్పించారు. మద్యం లంచాల సొమ్ము భద్రపరిచేందుకు తాడేపల్లి ప్యాలెస్ సమీపంలోని ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసుకున్న డెన్‌కు ప్రణోయ్ ప్రకాశ్ నిర్వాహకుడిగా ఉన్నారు. ఆ సొత్తును గత సార్వత్రిక ఎన్నికల్లో పంపిణీ కోసం ఎప్పటికప్పుడు వైఎస్సార్సీపీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి మనుషులకు చేర్చడంలో కీలక పాత్రధారిగా వ్యవహరించారు.కట్టా ప్రణోయ్ ప్రకాశ్‌తో వైఎస్సార్సీపీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి టాంజానియాలో చెట్టాపట్టాలు వేసుకుంటూ తిరిగారు. మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొమ్ముతో టాంజానియాలో ఇనుప ఖనిజ కర్మాగారం ఏర్పాటుచేయాలని, జింబాబ్వే సహా పలు ఆఫ్రికా దేశాల్లో పెట్టుబడులు పెట్టాలని వైఎస్సార్సీపీ ముఠా ముమ్మర యత్నాలు చేసింది. అక్కడ సాధ్యాసాధ్యాల అధ్యయన బాధ్యతల్ని ప్రణోయ్ ప్రకాశ్‌కు అప్పగించింది. ఈ కేసు నిందితులైన చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి, వారి సన్నిహితుడు వెంకటేశ్ నాయుడు 2025 జనవరిలో టాంజానియాకు వెళ్లారు.ఆ దేశంలోని దార్ ఎస్ సలామ్ ప్రాంతంలో 2025 ఫిబ్రవరిలో ప్రణోయ్ ప్రకాశ్ జూలియస్ నైరేరే అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద చెవిరెడ్డి బాస్కరరెడ్డిని కలిసి చెట్టపట్టాలు వేసుకుని తిరిగారు. టాంజానియాలో కట్టా ప్రణోయ్ ప్రకాశ్ చెవిరెడ్డి భాస్కర రెడ్డితో కలిసి 6 రోజులు ఉన్నారు. ఆఫ్రికా దేశాల్లో పెట్టుబడులపై చర్చించారు. మద్యం లంచాల సొమ్ము ఎన్నికల్లో పంపిణీ చేసిన విషయం ఎవరికీ చెప్పొద్దని ప్రణోయ్ ప్రకాశ్‌ను చెవిరెడ్డి బాస్కరరెడ్డి ఈ సందర్భంలోనే ఆదేశించారు. మద్యం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి, మరో కీలక నిందితుడు బూనేటి చాణక్య, ముఠాలోని ఇతర సభ్యులు ఓ ప్రైవేట్ జెట్‌లో ప్రయాణించారు. దీని వీడియో ఫోరెన్సిక్ విశ్లేషణలో సిట్‌కు లభ్యమైంది. అడ్డగోలుగా దోచుకున్న మద్యం లంచాల సొమ్ముతో ఈ ముఠా విలాసవంతమైన ప్రయాణాలు చేసింది. విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసింది. 2019 వరకూ సామాన్యులుగా ఉన్న వీరు ఒకేసారి ప్రైవేట్ జెట్లలో ప్రయాణించే స్థాయికి చేరారు. మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొత్తునే వీరు ఇలా వెచ్చించారని సిట్ నిర్ధారించింది.మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన అక్రమార్జనలో 13. 5 శాతం వాటా ఇవ్వాలని కట్టా ప్రణోయ్ ప్రకాశ్ ఈ కేసులో నిందితుడు టి. ఈశ్వర్ కిరణ్‌కుమార్ రెడ్డిని బెదిరిస్తూ మెసేజ్‌లు పంపించారు. లేదంటే విజిల్ బ్లోయర్‌గా మారి అక్రమాల గుట్టంతా బయట పెట్టేస్తా, సిట్‌కు చెప్పేస్తా అంటూ చాట్‌లో బెదిరింపులకు దిగినట్లు ఉంది. 'అక్రమాల గుట్టువిప్పితే నీ పాత్ర, ఐప్యాక్ ప్రతినిధి అనురాగ్ బండారం బయటపడుతుందని బెదిరించినట్లు చాట్ ద్వారా తేలింది. 'ఇప్పటివరకూ విజయసాయి రెడ్డి విజిల్ బ్లోయర్ కాలేదు. తాను విజిల్ బ్లోయర్‌గా మారుతా' అని ప్రణోయ్ ప్రకాశ్ చెప్పినట్లు చాట్‌లో ఉంది. దుర్భాషలు, బూతులతో వారి సంభాషణ సాగింది. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లుగా నిందితులంతా మద్యం లంచాల సొమ్ములో వాటాలు పంచుకోవటానికి ఎలా గొడవలు పడ్డారో చెప్పేందుకు ఈ చాటింగే నిదర్శనంగా నిలిచింది.మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీలు, బ్రూవరీస్ నుంచి నగదు రూపంలో వసూలు చేసిన లంచాల సొమ్ము దాచేందుకు అక్కడి నుంచి మరో చోటుకు తరలించేందుకు వైఎస్సార్సీపీ ముఠా హైదరాబాద్, అమరావతిల్లో పలుచోట్ల డెన్‌లు ఏర్పాటు చేసుకుంది. వాటిలో హైదరాబాద్ ఖాజాగూడ సర్కిల్‌లోని ఉమాహిల్ క్రెస్ట్ అపార్ట్‌మెంట్ ఒకటి. అక్కడ 2021 జులై 12న ఫొటో తీసుకున్నారు.చిత్రంలో కనిపిస్తున్న నోట్ల కట్టలన్నీ వివిధ డిస్టిలరీలు, వారి ప్రతినిధుల నుంచి వైఎస్సార్సీపీ ముఠా వసూలు చేసిన లంచాల సొమ్మే. 2021 జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు బాలాజీ ఎంటర్‌ప్రైజెస్, ఎలైట్ వింటేజ్ విస్కీ బ్రాండ్ ప్రతినిధుల నుంచి వసూలు చేసిన లంచాల సొమ్ము. నెక్టార్ బాట్లింగ్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్, సత్యనారాయణ అనే వ్యక్తి నుంచి వసూలు చేసిన లంచాల సొమ్ము ఉంది. ఓ అట్టపెట్టెలో 20.07 లక్షల రూపాయలు, మరోదానిలో రూ.4 లక్షలు, ఇంకో దానిలో రూ.4.36 లక్షలు ఉన్నట్లు పైన రాసి డెన్‌లో భద్రపరిచారు.మద్యం కుంభకోణం కేసు ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి, మరో నిందితుడు ఈశ్వర్ కిరణ్‌కుమార్ రెడ్డి ఓ ఖరీదైన పబ్‌లో అమ్మాయిలతో ఎంజాయ్ చేస్తున్నట్లు చిత్రంలో ఉంది. మద్యం లంచాల సొమ్ముతో వీరు ఎంత విలాసవంతమైన జీవితం గడిపారో చెప్పేందుకు ఇదో తార్కాణంగా నిలిచింది.



## అక్కడ రూ.2లక్షలు ఇక్కడ రూ.999కే

**మామిడి మేళాలో ప్రత్యేక ఆకర్షణ మియాజాకీ**

**బీచ్‌రోడ్డులో మామిడి వైభవం**

**ఒక్కచోట 40 రకాల సేంద్రియ పండ్లు**

**సేంద్రియ మామిడితో ఆరోగ్యానికి భరోసా అంటున్న వైద్యులు**



గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని బీజేపీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సేంద్రియ మామిడి పండ్ల మేళా విశాఖ నగరవాసులను ఆకట్టుకుంటోంది. ఈ మేళాలో దాదాపు 40 రకాల మామిడి పండ్లను విక్రయానికి ఉంచారు. ప్రత్యేకించి మియాజాకీ, ఇమామ్ పసంద్, మల్లిక, అమృతం, కేసరి, స్వాగతం, చిలుకలు మామిడి, కొబ్బరి మామిడి, పలుకులు, బంగినపల్లి, సువర్ణరేఖ, దసేరీ, రసాలు రకాలకు సందర్శకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.'మామిడిలో అత్యుత్తమ జాతి మియాజాకీ. ఇది మూలంగా జపాన్ విత్తనం. చాలా అరుదు. మన రాష్ట్రంలో ఈ విత్తనాన్ని అభివృద్ధి చేసి ఉత్తరాంధ్రలో సాగు చేస్తున్నాం. విదేశాల్లో కిలో రూ.2లక్షలకు పైగా ధర పలుకుతున్న ఈ రకాన్ని ఇక్కడ రూ.999కే అందిస్తున్నాం. చంపావతి, గోస్తని, బహుదా నదీ పరీవాహక ప్రాంతాలు ఈ పంటకు అనువుగా ఉన్నాయి. అందుకే ఎస్.కోట, గజపతినగరం, ఇచ్ఛాపురం ప్రాంతాల్లోని నాలుగు ప్లాంట్లలో సాగు చేస్తున్నాం. ఆన్‌లైన్‌లో కూడా ఆర్డర్ చేసుకునే సౌకర్యం కల్పించాం' అని మియాజాకీ ఉత్పత్తుల మేనేజర్ సీహెచ్ దివ్య వివరించారు. చూడటానికి సాధారణం – తింటే అమృతం: ఉత్తరాంధ్రలో పూర్తిగా సేంద్రియ విధానంలో పండించిన అన్ని మామిడి రకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని నిపుణులు చెప్తున్నారు. ఆరోగ్యకరమైన పండ్లను నగర ప్రజలకు చేర్చడమే మా ఉద్దేశమని ఆయన అన్నారు. వచ్చే శని, ఆదివారాల్లో మరిన్ని కొత్త రకాలు తీసుకొస్తామన్నారు. బయట మార్కెట్‌లో రసాయనాలతో మగ్గించిన పండ్ల రంగు చూసి మోసపోవద్దని సూచిస్తున్నారు. మా పండ్లు చూడటానికి సాధారణంగా ఉన్నా రుచిలో అద్భుతంగా ఉంటాయని మామిడి పండ్ల నిపుణుడు అప్పాజీ చెప్పారు.రసాయనాలతో పండిన మామిడి తింటే ఆరోగ్యం దెబ్బతింటుందని వ్యవసాయదారుడు ఎస్. సత్యనారాయణ వివరించారు. అందుకే ఎస్.కోట ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మామిడి తోటలు పెంచుతున్నామన్నారు. వేపగుంట, గాజువాక వీకెండ్ సంతల్లోనూ ఈ సేంద్రియ మామిడి పండ్లను విక్రయిస్తున్నామని గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుడు ఎస్.సత్యనారాయణ తెలిపారు.

## 29 గ్రామాలు, 9 జోన్లు భూసమీకరణలో సీఆర్డీఏ సంస్కరణలు

**రెండో విడత ఎల్పీఎస్‌కు బూస్ట్ , 8 యూనిట్లకు ప్రత్యేక అధికారులు**

**క్షేత్రస్థాయిలో సమస్యలకు చెక్ , ఎల్పీఎస్‌కు రోజువారీ సమీక్ష**



రాజధాని ప్రాంతంలో భూసమీకరణ పథకం (ఎల్పీఎస్)ను మరింత వేగంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు సీఆర్డీఏ వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. మొదటి విడతలో భూసమీకరణ పూర్తయిన 29 గ్రామాలను 9 జోన్లుగా విడదీసి ఒక్కో జోన్‌కు ఒక డిప్యూటీ కలెక్టర్ చొప్పున బాధ్యతలు అప్పగించింది. రెండో విడత ఎల్పీఎస్ గ్రామాలను 8 యూనిట్లుగా ఏర్పాటు చేసి అక్కడి పనులను పరుగులు పెట్టించనుంది.జోనల్ కార్యాలయాలకు సిబ్బంది కేటాయింపు: కొత్తగా ఏర్పాటు చేసిన జోనల్ కార్యాలయాల్లో పనిచేసేందుకు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను తిరిగి సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఎన్నెస్పీ, ఆర్-1 జోన్, సీఆర్డీఏ ఎల్పీఎస్ విభాగాలతో పాటు గుంటూరు, పల్నాడు జిల్లా యంత్రాంగంతో సమన్వయం కోసం, భూసేకరణ వ్యవహారాల కోసం ప్రత్యేక అధికారిని నియమించారు.రాజధాని అభివృద్ధి, ఎల్పీఎస్ ప్రక్రియ వేగం పెంచడం, రైతులకు నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో కమిషనర్ విజయరామరాజు ఈ మార్పులు చేశారు. ఇంజినీరింగ్, భూసమీకరణ, భూసేకరణ, అభివృద్ధి పనులు, రైతు సేవల విభాగాలకు వేర్వేరుగా ప్రత్యేకాధికారులను నియమించడంతో పర్యవేక్షణ వ్యవస్థ మరింత బలపడనుంది.రాజధాని విస్తరణలో భాగంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 7 గ్రామాల్లో రెండో విడత భూసమీకరణ చేపట్టారు. మొదట్లో రైతుల అనుమానాలు తీర్చడంలో ఆలస్యం కావడంతో ఆశించిన మేర భూమి రాలేదు. దీంతో గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన 8 యూనిట్లకు 8 మంది ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లను నియమించారు. వారికి సరిపడా సిబ్బందిని ఇచ్చి ప్రతి రోజూ పురోగతి సమీక్షిస్తున్నారు. సమస్యలు వచ్చిన చోటే పరిష్కారం చూపే ఏర్పాటుతో పనులు ఊపందుకున్నాయి.

## నిత్యావసర వస్తువుల ధరలపై సమీక్ష

**ధరల స్థిరీకరణపై క్యాబినెట్ ఉపసంఘం భేటీ**

**ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు**

**ధరల స్థిరీకరణపై అధికారులతో కలిసి సమావేశమైన మంత్రులు**

**పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో పెరిగిన ధరల నియంత్రణకు చర్యలు**



నిత్యావసర వస్తువుల ధరలు ప్రజలకు అందుబాటులో ఉండేలా మార్కెట్ పోకడలను నిరంతరం సమీక్షించాలని, ధరల హెచ్చుతగ్గులను పర్యవేక్షించాలని ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ధరల స్థిరీకరణపై క్యాబినెట్ ఉపసంఘం' 8వ సమావేశం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడుతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.నిత్యావసర వస్తువుల ధరల స్థిరికరణకు అధికారులు నిత్యం పర్యవేక్షించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. ఈ సమావేశంలో పప్పుధాన్యాలు, బియ్యం, వంట నూనెలు, టమాటాలు, ఉల్లిపాయల వంటి కీలక వస్తువుల మార్కెట్ ధరలను పరిశీలించారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ సంఘర్షణల కారణంగా ధరలలో స్వల్ప పెరుగుదల సంభవించినప్పటికీ వాటిని నియంత్రించడానికి ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్ కోసం వ్యవసాయ, పౌర సరఫరా శాఖలు ముందస్తు ప్రణాళికలను రూపొందించాలని నిర్ణయించారు. అంతేకాకుండా రైతులకు వరి విత్తనాలను అందించడానికి అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ప్రకటించారు.నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడటానికి ప్రభుత్వం నిరంతర అప్రమత్తతతో వ్యవహరిస్తోంది. అంతర్జాతీయ పరిణామాల ప్రభావం ఉండే అవకాశం ఉన్న దృష్ట్యా, ధరల స్థిరీకరణ కమిటీ ప్రత్యేక సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. రాబోయే వ్యవసాయ సీజన్ కోసం ప్రభుత్వం సమగ్ర సన్నద్ధతతో ముందుకు సాగుతోంది. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడానికి ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అలాగే పంట ఉత్పత్తిని పెంచడానికి తగిన చర్యలు తీసుకుంటున్నారు.

# బెల్లంముక్కతో ఎన్నో సమస్యలు దూరం

**వీటితో కలిపి తింటే సూపర్ బెనిఫిట్స్!**

**బీపీ, రక్తహీనత, అజీర్తి నెలసరి సమస్యలకు చెక్**

**విటమిన్లతో పాటు అనేక ఖనిజాలు పుష్కలం!**



జీర్ణ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారా? అయితే బెల్లం తినాల్సిందే! మలబద్ధకం సమస్య వేధిస్తోందా? దానికీ బెల్లమే పరిష్కారం! నెలసరి నొప్పులతో బాధపడుతున్నారా? బెల్లం ఉందిగా! ఇలా చెప్పుకుంటూ పోతే బెల్లం తింటే నయం కాని అనారోగ్యమంటూ ఉండదంటే అది అతిశయోక్తి కాదని నిపుణులు చెబుతుంటారు. అయితే ఈ బెల్లాన్ని నేరుగా కంటే కొన్ని పదార్థాలతో కలిపి తీసుకుంటే దాని సుగుణాలు రెట్టింపు అవుతాయంటున్నారు. ఫలితంగా ఆయా ఆరోగ్య సమస్యల్ని తగ్గించడంలో బెల్లం మరింత ప్రభావవంతంగా పని చేస్తుందని వెల్లడిస్తున్నారు. అజీర్తి దగ్గర నుంచి ఆకలిని అదుపు చేసే దాకా, నెలసరి సమస్యల్ని తగ్గించడం నుంచి చనుబాలు ఉత్పత్తి చేసే దాకా ఇలా ప్రతి ఒక్కటీ బెల్లంతో ముడిపడి ఉంటుందని వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బెల్లాన్ని ఏయే పదార్థాలతో కలిపి తీసుకుంటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయో ఇప్పుడు తెలుసుకుందాం.బెల్లంలో క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఎన్నో ఖనిజాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇంకా బి-కాంప్లెక్స్, సి, డి 2, ఇ వంటి విటమిన్లు నిండి ఉన్న బెల్లాన్ని తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయని వెల్లడిస్తున్నారు. దీని వల్ల బీపీని అదుపు చేయడం, శరీరానికి తక్షణ శక్తిని అందించడం, నెలసరి నొప్పుల నుంచి ఉపశమనం కలిగించడం, రక్తహీనతను తగ్గుతుందని వివరిస్తున్నారు.

## బెల్లం నెయ్యి

ఈ రెండూ కలిపి తీసుకుంటే మలబద్ధకం సమస్య నుంచి విముక్తి పొందచ్చు. బెల్లంంధని యాలు: ఇలా తీసుకుంటే నెలసరి సమయంలో అధిక రక్తస్రావం, నొప్పుల నుంచి విముక్తి పొందచ్చు. ఇంకా స్పాటింగ్ మాత్రమే అవుతోందని బాధపడే వారికి ఆ సమస్య తగ్గి ఎప్పటిలాగే పిరియడ్స్ ప్రారంభమవుతాయట.

## బెల్లం సోంపు

ఇది నోటి దుర్వాసనను దూరం చేస్తుంది. అంతేకాకుండా దంతాలపై పాచి పేరుకుపోకుండా చూసుకోవచ్చు.

## బెల్లం మెంతులు

ఇలా రెండు కలిపి తీసుకుంటే జుట్టు ఆరోగ్యం రెట్టింపు అవుతుంది. కుదుళ్లు దృఢంగా మారడమే కాకుండా.. తెల్ల జుట్టు రాకుండా జాగ్రత్తపడచ్చు.

## బెల్లం గోంద్

ఎముకల్ని దృఢంగా చేయడానికి ఈ ఫుడ్ కాంబినేషన్ చక్కగా ఉపకరిస్తుందని నిపుణులు అంటున్నార. అలాగే పాలిచ్చే తల్లులు తీసుకుంటే చనుబాలు పుష్కలంగా ఉత్పత్తి అవుతాయని తెలిపారు.

## బెల్లం అలీవ్ గింజలు

మనం తీసుకునే ఆహారంలోని ఫోలికామ్లం, ఐరన్‌ను శరీరం త్వరగా గ్రహించేందుకు ఈ ఫుడ్ కాంబినేషన్ తోడ్పడుతుందని తెలిపారు. ఇక చర్మంపై ఏర్పడిన పిగ్మెంటేషన్‌ని తగ్గించడంతో పాటు జుట్టు పెరుగుదలకూ దోహదం చేస్తుందని వివరించారు.

## బెల్లం నువ్వులు

ఈ రెండింటిని కలిపి తినడం వల్ల దగ్గు, జలుబు, ఫ్లూ వంటివి దరిచేరకుండా కాపాడుతుంది.

## బెల్లంంపల్లీలు

శరీరంలో సత్తువను పెంచడానికి, ఆకలిని అదుపు చేయడానికి, ఆహారపు కోరికల్ని తగ్గించడానికి ఈ ఫుడ్ కాంబినేషన్ అద్భుతంగా పని చేస్తుందని నిపుణులు అంటున్నారు.

బెల్లంంపసుపు: ఈ రెండూ కలిపి తీసుకుంటే రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చని చెబుతున్నారు.

బెల్లంంశొంఠి పొడి: వీటిని కలిపి తినడం వల్ల జ్వరం నుంచి త్వరగా కోలుకోవచ్చు. ఇంకా శరీరంలోని వాపును తగ్గించడానికి ఇది దోహదం చేస్తుంది.

# ఇవి తింటే స్ట్రోక్ వచ్చే ఛాన్స్ తక్కువట



మీకు 30 ఏళ్లు దాటాయా? అయితే మీరు తినే ఆహారంలో ఈ పదార్థాలు చేర్చుకుంటే మంచిదట! వీటిని మీ డైట్?లో జతచేసుకోవడం వల్ల స్ట్రోక్ వచ్చే అవకాశాలు తక్కువని నిపుణులు చెబుతున్నారు. మన జీర్ణవ్యవస్థకు మెదడు ఆరోగ్యానికి మధ్య సంబంధం ఉందని 18వ శతాబ్దంలోనే శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఈ నేపథ్యంలోనే వాటిపైన మరింత అధ్యయనం చేశారు. ఇందులో భాగంగా జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవులు, మంచి బ్యాక్టీరియా.. మెదడు ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో పరిశీలించారు. ఇందులో శరీరంలోని రెండు ప్రధాన భాగాలైన జీర్ణవాహిక, కేంద్ర నాడీ వ్యవస్థ మధ్య పరస్పర కమ్యూనికేషన్ జరిగినట్లు తేల్చారు. ప్రోబయాటిక్స్ గుణాలున్న ఆహారం తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండి మెదడును రక్షిస్తుందని వెల్లడించారు.మరోవైపు జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవులు, మంచి బ్యాక్టీరియా సంఖ్య పెరగడం వల్ల దీర్ఘకాలంలో స్ట్రోక్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు తేల్చారు. 2025లో అనే అధ్యయనంలో తేలింది. ఈ నేపథ్యంలోనే జీర్ణవ్యవస్థ, మెదడు మధ్య ఉన్న సంబంధంపై చైనాకు చెందిన ఫుడాన్ యూనివర్సిటీ పరిశోధకులు అధ్యయనం చేశారు. నేషనల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎగ్జామినేష్ సర్వేలోని డేటాను సేకరించి పరిశీలించారు. ఇందులో 20ఏళ్లు దాటిన వివిధ ప్రాంతాలు, వివిధ ఆహారపు అలవాట్లు ఉన్న 48,677 మంది వివరాలు సేకరించారు. వీరికి జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని పెంచే అవకాడోలు, బ్రకోలీ, కాఫీ, శనగలు, క్రాన్?బెర్రీలు, డెయిరీ పదార్థాలు, సోయా, తృణధాన్యాలు ఆధారంగా ఎక్కువ స్కోర్లు ఇచ్చారు. దీంతో పాటు ప్రాసెస్ చేసిన ఆహారం, మాంసం తీసుకున్నవారికి తక్కువ స్కోర్లు ఇచ్చి విభజించారు. ఇందులో 20-29 ఏళ్ల మధ్య ఉన్నవారిలో ఎలాంటి మార్పులను గమనించలేదని పరిశోధకులు వెల్లడించారు. అదే 30 ఏళ్లు దాటినవారిలో జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటే.. స్ట్రోక్ వచ్చే అవకాశం తగ్గినట్లు కనిపెట్టారు. ముఖ్యంగా ఆకుకూరలు, వివిధ రకాల పోషకాలు ఉన్న ఆహారం తినేవారిలో స్ట్రోక్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులు, ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం తక్కువని తెలిపారు.మరోవైపు జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా లేకపోవడం వల్ల స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని 2022లో అధ్యయనంలో తేలింది. జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవుల సమతుల్యంగా లేకపోవడం వల్ల హైపర్ టెన్షన్, డయాబెటిస్, ఊబకాయం, జీర్ణక్రియ సమస్యలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇవన్నీ దీర్ఘకాలంలో స్ట్రోక్?కు దారితీసే ప్రమాదం ఉందని వివరించారు. అధిక రక్తపోటు, అధిక చక్కెర స్థాయిల, జీర్ణక్రియ సమస్యల వల్ల మెదడులో రక్తం గడ్డకట్టే అవకాశం ఉంటుందని వెల్లడించారు.

# 'ఇవి తింటే యూరిక్ యాసిడ్ తగ్గిపోతుంది'

**బెస్ట్ రిజల్ట్స్ కోసం ఎప్పుడు తినాలి ?**

**ఈ 6 పదార్థాలు తీసుకుంటే యూరిక్ యాసిడ్ తగ్గతుందట!**

**ఎలా తీసుకుంటే మంచి లాభాలు ఉంటాయో తెలుసా ?**

ఈ మధ్య కాలంలో చాలా మంది యూరిక్ యాసిడ్ సమస్యతో బాధపడుతున్నారు. శరీరంలో యూరిక్ యాసిడ్ లెవల్స్ పెరగడం వల్ల నొప్పితో పాటు గౌట్, కిడ్నీలో రాళ్లు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో అనేక మందులతో పాటు ఆహార నియమాలు పాటిస్తుంటారు. అయితే కొన్ని డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం వల్ల ఈ సమస్య నుంచి తప్పించుకోవచ్చని సూచిస్తున్నారు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్?ఫ్లమేటరీ గుణాలు.. యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గేలా చేస్తాయని వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అవేంటి వాటిని ఎప్పుడు, ఎలా తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.యూరిక్ యాసిడ్ఎలా ఏర్పడుతుంది.మనం రోజూ తీసుకునే ఆహారంలోని ప్రొటీన్ల నుంచి ప్యూరిన్ అనే రసాయనం విచ్ఛిన్నం చెంది యూరిక్ యాసిడ్‌గా ఏర్పడుతుంది. ఇలా ఏర్పడిన యూరిక్ యాసిడ్ ఎప్పటికప్పుడూ మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతుంది. కానీ కొన్ని సందర్భాల్లో యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉత్పత్తి కాగా, అంతే స్థాయిలో మూత్రం ద్వారా సరిగ్గా బయటకు వెళ్లనప్పుడు సమస్య వస్తుంది. యూరిక్ యాసిడ్ విసర్జన సరిగ్గా జరగక అది రక్తంలోని నిలిచిపోతుంది. అలా నిలిచిపోయిన యూరిక్ యాసిడ్ స్ఫటికాలుగా మారి కీళ్లు, కీళ్ల చుట్టూ ఉండే కణజాలాల్లో పేరుకుపోయి హైపర్? యూరిసిమియాకు దారి తీస్తుంది.



**వాల్ నట్స్ :** ఇందులో పుష్కలంగా ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ వాపు, నొప్పిని తగ్గించడంలో బాగా ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంకా యూరిక్ యాసిడ్‌ను తొలగించి కిడ్నీ పనితీరును మెరుగపరచడంలోనూ సాయపడుతుందని వెల్లడిస్తున్నారు. 2-3 వాల్ నట్స్‌ను ముందు రోజు రాత్రి నీటిలో నానబెట్టాలి. అనంతరం పరగడుపునే తినవచ్చని లేదా స్మూతీలు, సలాడ్?తో పాటు తీసుకోవాలని చెబుతున్నారు.

**పిస్తా :** పిస్తాల్లో పాలీఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు గుణాలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. ఇవి యూరిక్ యాసిడ్, వాపు పెరిగేందుకు కారణమైన ఆక్సిడేటివ్ స్ట్రెస్‌తో పోరాడుతుందని వివరిస్తున్నారు. ఇంకా ఇందులోని ఆరోగ్యకరమైన పోషకాలు జీర్ణక్రియను మెరుగపరచడంలో సాయపడతాయని తెలిపారు.సుమారు 15 పిస్తాలను ఉదయాన్నే తినాలని చెబుతున్నారు. అయితే, వీటిని వేయించకుండా, ఎలాంటి ఉప్పు లేకుండా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఉప్పుతో తీసుకుంటే కిడ్నీ పనితీరుపై చెడు ప్రభావం చూపిస్తుందని తెలిపారు.

**బాదం :** బాదంలో జీర్ణక్రియను పెంచే, యూరిక్ యాసిడ్ లెవల్స్‌ను అదుపులో పెట్టే మెగ్నీషియం పోషకాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇది శరీరంలోని యూరిక్ యాసిడ్‌ను బయటకు పంపడంతో పాటు కిడ్నీ పనితీరును పెంచుతుందని వివరిస్తున్నారు. 5-6 బాదంను రాత్రి పూట నీటిలో నానబెట్టి ఉదయాన్నే వాటి పొట్టును తీసి ఖాళీ కడుపుతో తినాలని చెబుతున్నారు. అలా తినలేకపోతే మిక్సీ పట్టి పాలల్లో లేదా ఓట్ మీల్‌లో కలిపి తాగాలని అంటున్నారు.

**జీడిపప్పు :** మెగ్నీషియంతో పాటు హెల్దీ ఫ్యాట్ లభించే అద్భుతమైన పదార్థాల్లో జీడిపప్పు ఒకటి. ఇవి వాపును తగ్గించడంతో పాటు జీర్ణక్రియను పెంచడంలో సహాయ పడతాయని నిపుణులు వెల్లడిస్తున్నారు. ఇందులో ప్యూరిన్స్ తక్కువగా ఉండడం వల్ల యూరిక్ యాసిడ్ అదుపులో ఉంటుందని వివరిస్తున్నారు. ఉదయాన్నే 4-5 జీడిపప్పులను ఎలాంటి ఉప్పు లేకుండానే తినాలని చెబుతున్నారు. వీలైతే ఇతర నట్స్‌తో తీసుకుంటే సమతుల పోషకాలు అందుతాయని తెలిపారు.

**డేట్స్ (ఖర్జూర) :** ఇందులో ఫైబర్, పొటాషియం లాంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి రెండూ యూరిక్ యాసిడ్‌ను బయటకు పంపడంతో పాటు కిడ్నీ పనితీరును మెరుగుపరుస్తాయని అంటున్నారు. ఇంకా సహజంగానే శక్తిని పెంచేలా చేస్తుందని వివరిస్తున్నారు.ఉదయాన్నే 1-2 డేట్స్ నేరుగానే తినాలని లేదా స్మూతీలు, సలాడ్‌లో కలిపి తీసుకోవచ్చని చెబుతున్నారు.

**బ్రెజిల్ నట్స్ :** ఇందులో వాపును తగ్గించే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్న సెలీనియం పుష్కలంగా ఉంటుందని తెలిపారు. ఇంకా ఇది యూరిక్ యాసిడ్?ను బయటకు పంపి కిడ్నీలు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుందని వివరిస్తున్నారు.రోజూ 1-2 బ్రెజిల్ నట్స్ తినాలని.. అతిగా తింటే సెలీనియం శరీరానికి హానికరమని అంటున్నారు. ఉదయాన్నే నేరుగా లేకపోతే గ్రైండ్ చేసి తీసుకోవచ్చని చెబుతున్నారు.ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# రోజూ ఇవి వాడితే కిడ్నీలు ఫెయిల్ అయ్యే ఛాన్స్

**పెయిన్ కిల్లర్స్ అతిగా వాడడం వల్ల కిడ్నీ ఫెయిల్**

**కిడ్నీలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలివే**



మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు ఒకటి. ఆహారం జీర్ణమయ్యే సమయంలో ఏర్పడే మలినాలు, శరీరంలో జరిగే జీవక్రియలో ఏర్పడే వ్యర్థ పదార్థాలను ఎప్పటికప్పుడూ తొలగించి ఆరోగ్యంగా ఉండేలా కిడ్నీలు సాయంచేస్తాయి. అయితే, ఇటీవల కాలంలో అనేక కారణాల వల్ల చాలా మంది కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. దీనికి కారణం సరైన ఆహారం తీసుకోకపోవడం, అధిక రక్తపోటు అని చాలా మంది అనుకుంటారు. కానీ, రోజూవారీ జీవితంలో ఉపయోగించే కొన్ని వస్తువుల వల్ల కూడా మన మూత్ర పిండాలు దెబ్బతింటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.ఫెయిర్ నెస్ క్రీమలు: చాలా మంది ఉపయోగించే ఫెయిర్ నెస్ క్రీముల వల్ల కిడ్నీలు దెబ్బతింటాయని నిపుణులు అంటున్నారు. ఇందులో మెలనిన్ ఉత్పత్తిని అడ్డుకునేందుకు వాడే హానికారక మెర్క్యురీ అధికంగా ఉంటుందని.. దీనిని చర్మం గ్రహించడం వల్ల శరీరంలోకి చేరి కిడ్నీలు చెడిపోయే ప్రమాదం ఉందని వెల్లడించారు. దీర్ఘకాలం పాటు మెర్క్యురీతో కూడిన సౌందర్య ఉత్పత్తులను వాడడం వల్ల కిడ్నీ ఫెయిల్ అయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అందుకోసమే ఇలాంటి ఉత్పత్తులు కొనేముందు అందులోని పదార్థాలను చూడాలని.. అవసరమైతే డెర్మటాలజిస్ట్‌ను సంప్రదించాలని సూచించారు.

**హెర్బల్ సప్లిమెంట్లు :** హెర్బల్ సప్లిమెంట్లను ఫార్మా మందులకు ప్రత్యామ్నాయంగా భావిస్తుంటారు చాలా మంది. అయితే, వీటిపై నేచురల్, హెర్బల్ అని పెట్టినా సరే.. సరిగ్గా పరీక్షించకపోవడం వల్ల కొన్ని ఉత్పత్తుల్లో హానికారక రసాయనాలు కలిపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఆర్సనిక్, లెడ్, మెర్క్యురీ వంటి విషపూరిత పదార్థాలను వాడడం వల్ల అవి శరీరంలో పేరుకుపోయి కిడ్నీలను దెబ్బతీస్తాయని తెలిపారు. అందుకే హెర్బల్ ఉత్పత్తులను వాడే ముందు డాక్టర్లను సంప్రదించాలని.. మంచి పేరున్న బ్రాండ్ ఉత్పత్తులను వాడాలని సూచిస్తున్నారు.

**పెయిన్ కిల్లర్స్ :** మనలో చాలా మంది తల, కండరాల నొప్పులు లేదా ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు నేరుగా షాపునకు వెళ్లి పెయిన్ కిల్లర్స్ తీసుకుంటారు. అయితే, ఈ మందులు స్వల్పకాలం నొప్పిని తగ్గించినా.. దీర్ఘకాలంలో అనేక ఇబ్బందులను తెస్తాయని నిపుణులు వెల్లడించారు. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని వివరిస్తున్నారు. వీటిని తరచూగా తీసుకోవడం వల్ల కిడ్నీలకు రక్త సరఫరాను తగ్గి ఫలితంగా కిడ్నీలు ఫెయిల్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

**గ్రీన్ టీ :** ప్రపంచంలోనే ఆరోగ్యకరమైన పానీయాల్లో గ్రీన్ టీకి ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు అంటుంటారు. కానీ, గ్రీన్ టీని ఎక్కువగా తాగడం వల్ల (రోజుకు అర లీటర్ కంటే ఎక్కువ) కిడ్నీలు ఫెయిల్ అవుతాయని మీకు తెలుసా? ఇందులో ఉండే ఆక్సలేట్స్.. క్యాల్షియంతో కలిసి కిడ్నీలో రాళ్లు ఏర్పడేలా చేస్తాయని వెల్లడించారు. అలా అని మొత్తంగా గ్రీన్ టీని మానేయాల్సిన అవసరం లేదని.. కానీ ఎక్కువ మోతాదులో తీసుకోకూడదని సూచిస్తున్నారు. మీకు ఇప్పటికే కిడ్నీలో రాళ్లు సమస్య ఉంటే తక్కువ మోతాదులో తాగాలని సలహా ఇస్తున్నారు.

**ప్రొటీన్ సప్లిమెంట్లు :** పోషకాహార లోపం ముఖ్యంగా జిమ్‌కు వెళ్లేవారు వ్యాయామంలో భాగంగా ప్రొటీన్ సప్లిమెంట్లను తీసుకుంటారు. కండరాలు పెరగడానికి చాలా మంది పౌడర్లు, షేక్స్ తీసుకుంటారు. అయితే, వీటిని అతిగా తీసుకోవడం వల్ల కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు అంటున్నారు. మనం తీసుకునే ప్రొటీన్లను ఫిల్టర్ చేసే బాధ్యత కిడ్నీలపై ఉంటుంది. ఈ క్రమంలోనే ప్రొటీన్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల వాటిని ఫిల్టర్ చేయలేక కిడ్నీపై ఒత్తిడి పెరిగి సమస్యలు వస్తాయని వివరించారు. అందుకే వీటిని మరీ ఎక్కువగా కాకుండా.. తగిన మోతాదులో తీసుకోవాలని అవసరమైతే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.హెయిర్ స్ట్రెయిటెనింగ్ ఉత్పత్తులు: కొంతమంది తరచూగా హెయిర్ స్ట్రెయిటెనింగ్ చేసుంకుంటారు. ఇందుకోసం మార్కెట్లో దొరికే కొన్ని ఉత్పత్తులను వాడుతుంటారు. అయితే, ఇందులో ఉండే గ్లైయాక్లాలిక్ యాసిడ్ చర్మం ద్వారా శరీరంలోకి చేరి కిడ్నీలను దెబ్బ తీస్తాయని వెల్లడిస్తున్నారు.



# షుగర్ పేషెంట్లు ఈ 6 పండ్లను అసలు తినకూడదట!

**గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువుంటే షుగర్ లెవల్స్ పెరుగుతాయట!**

**ఇవి ఎక్కువగా ఉండే పండ్లు**

ప్రతి రోజూ పండ్లను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతుంటారు. కానీ, మధుమేహంతో బాధపడే వారు మాత్రం పండ్లు తినాలంటే భయపడుతుంటారు. పండ్లలో చక్కెరస్థాయి ఎక్కువగా ఉంటుందని.. వాటిని తింటే రక్తంలో షుగర్ స్థాయిలు పెరుగుతాయని భయపడుతుంటారు. ముఖ్యంగా కొన్ని పండ్లను తీసుకుంటే మాత్రం చక్కెర స్థాయిలు పెరుగుతాయని



నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2002లో అనే అధ్యయనంలోనూ ఈ విషయం తేలింది. ఈ నేపథ్యంలోనే ఆ పండ్లు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

మనం రోజూ తీసుకునే ఆహారంలో ఉండే కార్బోహైడ్రేట్స్ వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు పెరుగుతుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇలా రక్తంలో చక్కెర స్థాయి ఎంత మేర పెరుగుతుందో తెలిపే కొలమానాన్నే గ్లైసెమిక్ ఇండెక్స్ అంటుంటారు. తీసుకునే ఆహారంలో చక్కెర స్థాయి 55కు మించకుండా ఉండే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ అని, 56-69 మధ్య ఉంటే మధ్యస్థ, 70కి మించి ఉంటే అధిక గ్లైసెమిక్ ఇండెక్స్‌గా విభజిస్తుంటారు. అయితే, మధుమేహం ఉన్నవారు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న పండ్లను తినాలని నిపుణులు సూచిస్తున్నారు. మధ్యస్థ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న పండ్లను తక్కువగా తింటే మంచిదని సలహా ఇస్తున్నారు. (రిపోర్ట్ కోసం ఇక్కడ క్లిక్ చేయండి)

**పుచ్చకాయ :** వేసవిలో వచ్చే పుచ్చకాయలో అనేక పోషకాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. కానీ ఇందులో 72-80 వరకు గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుందని.. ఫలితంగా ఎక్కువ షుగర్ స్థాయిలు ఉంటాయని తెలిపారు. అందుకే దీనిని వీలైనంత తక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

**అరటి**: సీజన్?తో సంబంధం లేకుండా ఉండే అరటిలో పండిన శాతం ఆధారంగా గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుందని వెల్లడిస్తున్నారు. అరటి కాయలో 42-62 వరకు ఉంటుందని.. పండిన తర్వాత ఇంకా ఎక్కువగానే ఉంటుందని వివరిస్తున్నారు. అందుకే వీటిని తక్కువగా తినాలని సూచిస్తున్నారు.

**పైనాపిల్:** ఇందులో సహజసిద్ధమైన చక్కెరలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. ఫలితంగా ఇది తిన్న వెంటనే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయని వెల్లడిస్తున్నారు. అందుకే తక్కువ మోతాదులో తినాలని సూచిస్తున్నారు.

**మామిడికాయ:** వేసవిలో మాత్రమే లభించే మామిడికాయ అంటే చాలా మందికి ఎంతో ఇష్టం ఉంటుంది. దీంతో ఎక్కువగా తింటుంటారు. ఇందులో 51-60 గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుందని, ఫ్రక్టోజ్, సూక్రోజ్ శాతం సైతం అధికంగా ఉంటుందని చెబుతున్నారు. చక్కెర స్థాయిలు పెరగకుండా ఉండాలంటే దీనిని తక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

**ద్రాక్ష:** ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగానే ఉంటుందని.. కానీ చిన్నగా ఉండడం వల్ల ఎక్కువగా తీసుకుంటామని అంటున్నారు. ఫలితంగా చక్కెర స్థాయిలు పెరుగుతాయని చెబుతు న్నారు. అందుకే వీలైనంత తక్కువగా ద్రాక్షను తినాలని సూచిస్తున్నారు.

**చెర్రీలు:** చెర్రీల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ స్థాయిలు రకరకాలుగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. వీలైనంత తక్కువగా తినాలని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచ నలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్

## ఈ ఒక్క ఏరియాలోనే ఇల్లు కావాలంటున్న కొనుగోలుదారులు



భాగ్యనగరంలో స్థిరాస్తి రంగం ఎప్పుడూ ఒక కొత్త మలుపు తీసుకుంటూనే ఉంటుంది. ఒకప్పుడు మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాలు ఐటీ కంపెనీల రాకతో ఎలాగైతే ఊహించని రీతిలో అభివృద్ధి చెందాయో.. ఇప్పుడు సరిగ్గా అదే తరహా వృద్ధి ఉత్తర హైదరాబాద్‘ వైపు కనిపిస్తోంది. రియల్టీ నిపుణుల విశ్లేషణ ప్రకారం.. రాబోయే కొద్ది ఏళ్లలోనే ఈ ప్రాంతం గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ స్థాయికి చేరుకోనుంది.గతంలో ఐటీ రంగం కేవలం పశ్చిమ హైదరాబాద్‌కే పరిమితమై ఉండేది. అయితే, నగరం నలువైపులా ఐటీని విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కండ్లకోయలో భారీ ఐటీ పార్క్‌ను ఏర్పాటు చేస్తోంది. సుమారు 6 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియాతో నిర్మిస్తున్న ఈ పార్క్.. విస్తీర్ణంలో ప్రఖ్యాత సైబర్ టవర్స్ కంటే పెద్దదిగా ఉండబోతోంది. భవిష్యత్తులో ఇక్కడ దాదాపు 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా. ఈ ప్రాజెక్టు ప్రకటనతోనే ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ఒక్కసారిగా పుంజుకుంది.ఉత్తర హైదరాబాద్ అభివృద్ధికి రవాణా సౌకర్యాలు వెన్నెముకగా నిలుస్తున్నాయి:రహదారులు: హైదరాబాద్-నాగ్‌పూర్ జాతీయ రహదారి ఈ ప్రాంతం గుండా వెళుతుంది. రద్దీని తగ్గించేందుకు సుచిత్ర నుండి కొంపల్లి వరకు సుమారు 10 కి.మీ మేర మూడు ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు.రైల్వే & ఎంఎంటీఎస్: ముంబై, షిర్డీ వెళ్లే ప్రధాన రైలు మార్గంతో పాటు బొల్లారం, మేడ్చల్ వరకు ఎంఎంటీఎస్ సదుపాయం ఉండటం ఉద్యోగులకు వరం.ప్రాముఖ్యత: ఇక్కడ జీనోమ్ వ్యాలీ, నల్సార్ వంటి అంతర్జాతీయ విద్యా, వైద్య సంస్థలు ఇప్పటికే కొలువుదీరాయి. ఇతర హైవేలతో పోలిస్తే ఇక్కడ ట్రాఫిక్ తక్కువగా ఉండటం వల్ల 30 నిమిషాల్లోనే నగరం నడిబొడ్డుకు చేరుకోవచ్చు.హైదరాబాద్‌లో గుడ్డిగా ఇల్లు కొని మోసపోవద్దు.. అనుమతులపై తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన హైడ్రా.. హైదరాబాద్‌లో గుడ్డిగా ఇల్లు కొని మోసపోవద్దు.. అనుమతులపై తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన హైడ్రా..అందుబాటులో ధరలు మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాలు ప్రస్తుతం ఖరీదైన పెట్టుబడి మార్కెట్లుగా మారాయి. సామాన్యులకు అక్కడ స్థలాలు కొనడం కష్టతరంగా మారింది. దీనికి భిన్నంగా ఉత్తర హైదరాబాద్‌లోని కొంపల్లి, మేడ్చల్ వైపు ధరలు అందుబాటులో ఉన్నాయి.అపార్ట్‌మెంట్లు: చదరపు అడుగుకు రూ.4,500 - రూ.5,000.గేటెడ్ కమ్యూనిటీ: చ.అ.కు రూ.5,500 - రూ.6,000.ఓపెన్ ప్లాట్లు: గజం ధర రూ.60,000 నుండి రూ.80,000 వరకు పలుకుతోంది.హాట్‌స్పాట్‌గా మారుతున్న ప్రాంతాలుప్రస్తుతం జీడిమెట్ల, దూలపల్లి, అల్వాల్, బొల్లారం, కొంపల్లి, కండ్లకోయ, శామీర్‌పేట మరియు మేడ్చల్ వంటి ప్రాంతాలు పెట్టుబడులకు కేంద్ర బిందువులుగా మారాయి. నిజామాబాద్, కామారెడ్డి వంటి ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన వారు కూడా ఇక్కడ భూములను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు ఇప్పటికే ఈ ప్రాంతంలో భారీ విల్లా ప్రాజెక్టులు, ఆకాశహర్మ్యాలను నిర్మించడానికి భూములను సేకరిస్తున్నాయి.ఏదేమైనా అభివృద్ధిని ముందుగానే ఊహించి పెట్టుబడి పెట్టే వారికి ఉత్తర హైదరాబాద్ ఒక బంగారు అవకాశంలా కనిపిస్తోంది. పశ్చిమ హైదరాబాద్‌తో పోలిస్తే ఇక్కడ తక్కువ ధరకే మెరుగైన జీవన ప్రమాణాలు కలిగిన ఇళ్లు లభించే అవకాశం ఉండటమే దీనికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు.డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి.

# బెంగళూరు రియల్ ఎస్టేట్ దూకుడు!




## మెట్రో పుణ్యమా అని ఆ ఏరియాల్లో

## 40% పెరగనున్న ధరలు!

బెంగళూరు అంటే ముందుగా ట్రాఫిక్ గుర్తొస్తుంది. కానీ ఇప్పుడు సీన్ మారుతోంది! బెంగళూరు అంటే మెట్రో సర్వీస్ కు కేరాఫ్ అనేగా సిటీ డెవలప్ అవుతుంది. మన సిలికాన్ వ్యాలీలో మెట్రో నెట్‌వర్క్ వేగంగా విస్తరిస్తుండటంతో, రియల్ ఎస్టేట్ మార్కెట్ ఒక్కసారిగా హీటెక్కింది. ముఖ్యంగా కొత్తగా వస్తున్న యెల్లో లైన్, పింక్ లైన్ మెట్రోల వల్ల కొన్ని ఏరియాల్లో ఇళ్ల ధరలు ఆకాశాన్ని తాకబోతున్నాయని ప్రముఖ సంస్థ ‘కొలియర్స్ ఇండియా‘ తాజా నివేదిక వెల్లడించింది. వచ్చే రెండేళ్లలో ప్రాపర్టీ రేట్లు ఏకంగా 20% నుండి 40% వరకు పెరిగే అవకాశం ఉందట! ఏ ఏరియాల్లో డిమాండ్ పెరుగుతోంది? ముఖ్యంగా సౌత్ బెంగళూరులో మెట్రో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. 2025లో అందుబాటులోకి వచ్చిన యెల్లో లైన్ (ఆర్వీ రోడ్ - బొమ్మసంద్ర) ఎలక్ట్రానిక్ సిటీ వంటి ఐటీ హబ్‌లకు కనెక్టివిటీని పెంచింది. దీనివల్ల ఆ ప్రాంతాల్లో రేట్లు ఇప్పటికే భారీగా పెరిగాయి. ఇక ఇప్పుడు అందరి కళ్లు పింక్ లైన్ (కాలేన అగ్రహార - నాగవార) మీద ఉన్నాయి. ధరల పెరుగుదల అంచనాలు ఇలా ఉన్నాయి.. బన్నెరఘట్ట రోడ్డు: ఇక్కడ పింక్ లైన్ ప్రభావం వల్ల వచ్చే రెండేళ్లలో ధరలు 30% నుండి 40% వరకు పెరగొచ్చని అంచనా. జేపీ నగర్: ఇక్కడ కూడా మెట్రో రాకతో 20% నుండి 30% వరకు ప్రాపర్టీ విలువ పెరగనుంది. ఎలక్ట్రానిక్ సిటీ: ఇప్పటికే 45% పెరుగుదల చూసిన ఈ ఏరియాలో, మరో 20-30 % పెరిగే ఛాన్స్ ఉంది. బీటీఎమ్ లేఅవుట్ & జయనగర్: ఈ ప్రాంతాల్లో కూడా 10% నుండి 20% వరకు పెరుగుదల కనిపి స్తుంది. ఎందుకు ఈ పెరుగుదల? సాధారణంగా ఎక్కడైనా రవాణా సౌకర్యం పెరిగితే అక్కడ డిమాండ్ పెరుగుతుంది. పింక్ లైన్ అందు బాటులోకి వస్తే బన్నెరఘట్ట రోడ్డు, జేపీ నగర్, శివాజీ నగర్ వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రయాణం చాలా ఈజీ అయిపోతుంది. ప్రయాణ సమయం తగ్గడం వల్ల ఐటీ ఉద్యోగులు, మిడిల్ క్లాస్ ఫ్యామిలీలు ఈ ఏరియాల్లో ఇళ్లు కొనడానికి లేదా అద్దెకు ఉండటానికి ఆసక్తి చూపిస్తున్నారు. దీనివల్ల లగ్జరీ అపార్ట్‌మెంట్లతో పాటు మిడి ల్-ఇన్కమ్ ఇళ్లకు కూడా విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. డెవలపర్ల ప్లాన్ ఏంటి ఈ డిమాండ్‌ను గమనించిన పెద్ద పెద్ద బిల్డర్లు పింక్ లైన్ పరిసర ప్రాంతాల్లో కొత్త ప్రాజెక్టులను వేగంగా లాంచ్ చేస్తున్నారు. ఆఫీస్ స్పేస్‌లు, రిటైల్ షాపులు, హోటళ్లు కూడా ఇక్కడ భారీగా రాబోతున్నాయి. మొత్తానికి, బెంగళూరు లో ఇల్లు కొనాలనే ఆలోచన ఉంటే మాత్రం ఆలస్యం చేయకపోవడమే మంచిదని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. ఎందుకంటే మెట్రో రైలు పట్టాలెక్కే కొద్దీ, ఇళ్ల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు వెళ్లేలా ఉన్నాయి!

# ఆఫీస్‌కు వెళ్లక్కర్లేదు బాస్ టెన్షన్ లేదు!

## జీతం మాత్రం 9 కోట్లు! ఇదెలా సాధ్యం



సోషల్ మీడియాలో ప్రస్తుతం ఒక వార్త ట్రెండింగ్ ) లో ఉంది. సాధారణంగా సాఫ్ట్‌వేర్ రంగంలో లేదా పెద్ద కంపెనీల్లో 15-20 ఏళ్ల అనుభవం ఉన్నవారికి కోట్లలో జీతం ఉండటం చూస్తుంటాం. కానీ, కేవలం 3 ఏళ్ల ఎక్స్‌పీరియన్స్‌తో ఏకంగా రూ. 9 కోట్ల వార్షిక ప్యాకేజీని అందుకుంటున్నానని ఒక యువతి చేసిన పోస్ట్ ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. సతాక్షి అనే యువతి తన రిమోట్ వర్క్ శాలరీ వివరాలను వెల్లడించడంతో నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. గూగుల్ మేనేజర్‌తో సమానంగా.. సతాక్షి తన పోస్ట్‌లో పేర్కొన్న దాని ప్రకారం.. ఆమె అందుకుంటున్న ప్యాకేజీ గూగుల్ ఇండియాలోని ఒక సీనియర్ మేనేజర్ శాలరీతో సమానం. “ఇదే రిమోట్ ఎంప్లాయ్‌మెంట్ అందం“ అంటూ ఆమె చెప్పుకొచ్చింది. మొదట్లో చాలా మంది ఇది నిజం కాదని కొట్టిపారేసినప్పటికీ, ఆమె తన ఆఫర్ లెటర్ స్క్రీన్ షాట్‌లను షేర్ చేయడంతో అందరి నోళ్లు మూతపడ్డాయి. తన విజన్, ఆలోచనా విధానం కంపెనీ లక్ష్యాలకు అనుగుణంగా ఉండటం వల్లే ఈ భారీ ప్యాకేజీ లభించిందని ఆమె తెలిపింది. కేవలం కంపెనీలే లక్ష్యం వద్దు! చాలా మంది యువత మెటా, అమెజాన్, ఆపిల్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్ వంటి దిగ్గజ కంపెనీల వెంటే పడుతుంటారు. కానీ సతాక్షి మరోలా ఆలోచించమని చెబుతోంది. అక్కడ పోటీ విపరీతంగా ఉంటుందని, కేవలం ఆ రొటీన్ పద్ధతిలో వెళ్లకుండా గ్లోబల్ రిమోట్ మార్కెట్‌ను ఎక్స్ ప్లోర్ చేయాలని సూచిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా టాలెంట్ ఉన్నవారి కోసం భారీగా చెల్లించే కంపెనీలు చాలా ఉన్నాయని ఆమె అభిప్రాయపడింది. కోట్లలో జీతం రావాలంటే ఏం చేయాలి డాలర్లు లేదా యూరోలలో జీతం ఇచ్చే రిమోట్ జాబ్స్ సాధించడం అంత సులభం కాదని ఆమె హెచ్చరించింది. నైపుణ్యం ఏదైనా ఒక రంగంలో పూర్తి పట్టు సాధించాలి. నెట్‌వర్కింగ్: గ్లోబల్ కంపెనీలతో నిరంతరం టచ్‌లో ఉండాలి. నిలకడ: ఫుల్ టైమ్ జాబ్ చేస్తూనే గ్లోబల్ అవకాశాల కోసం వెతకడం మానేయకూడదు. అందరూ చేసే పని చేస్తే అందరికీ వచ్చే జీతమే వస్తుందని, ప్రత్యేకంగా ఎదగాలంటే గ్లోబల్ మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్టుగా స్కిల్స్ పెంచుకోవాలని ఆమె స్పష్టం చేసింది. రిమోట్ వర్క్ ఎందుకు బెస్ట్? ప్రస్తుతం సాఫ్ట్‌వేర్, ఏఐ , డిజైనింగ్, మార్కెటింగ్ వంటి రంగాల్లో ఉన్నవారికి దేశ సరిహద్దులతో సంబంధం లేకుండా అవకాశాలు వస్తున్నాయి. ఇండియాలో ఉంటూనే అమెరికా లేదా యూరప్ కంపెనీలకు పని చేయడం వల్ల తక్కువ ఖర్చుతో కూడిన జీవనం సాగిస్తూనే, విదేశీ కరెన్సీలో భారీగా సంపాదించే వీలుంటుంది. ఈ ట్రెండింగ్ పోస్ట్ ద్వారా మనకు అర్థమయ్యే విషయం ఒక్కటే.. సక్సెస్‌కు ఇప్పుడు పాత పద్ధతులే కాదు, కొత్త మార్గాలు కూడా చాలా ఉన్నాయి! మరో ముఖ్యమైన విషయం ఏంటంటే, ఇలాంటి భారీ ప్యాకేజీలు అందరికీ ఒకేసారి రాకపోవచ్చు, కానీ ప్రయత్నం మాత్రం ఆపకూడదు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కంపెనీలు డిగ్రీల కంటే కేవలం ప్రతిభకే పట్టం కడుతున్నాయి. మీరు ఏ ఊరిలో ఉన్నా, మీ దగ్గర గ్లోబల్ మార్కెట్‌కు కావాల్సిన నైపుణ్యం ఉంటే ఆకాశమే హద్దుగా సంపాదించవచ్చు. అందుకే రొటీన్ బాటలో కాకుండా, కొత్త టెక్నాలజీలను నేర్చుకుంటూ అంతర్జాతీయ వేదికలపై మీకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోండి. అప్పుడు విజయం మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తుంది!

# ఉద్యోగం వదిలేసి స్టార్టప్ మొదలుపెట్టాడు




4 నెలల్లోనే రూ. 1 కోటి కొల్లగొట్టాడు! కేవలం 24 ఏళ్ల వయసులోనే ఓ భారతీయ యువ స్టార్టప్ ఫౌండర్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. తన స్టార్టప్ కేవలం నాలుగు నెలల్లోనే రూ. 1 కోటి ఆదాయాన్ని ఆర్జించిందని ఆయన చేసిన ప్రకటన నెట్టింట వైరల్ అవుతోంది. ఈ వార్త ఇప్పుడు ఉద్యోగుల మధ్య పెద్ద చర్చకు దారితీసింది. చాలామంది యువ ప్రొఫెషనల్స్ తమ రెగ్యులర్ ఉద్యోగాలను వదిలేసి, స్టార్టప్ రంగంలో అదృష్టాన్ని పరీక్షించుకోవాలని కలలు కంటున్నారు. అన్ష్ చౌదరి తన కార్పొరేట్ ఉద్యోగానికి రాజీనామా చేసి, ఆన్‌లైన్ క్రియేటర్ల కోసం ‘హఆఅన్సాశ్రీమ్ఘంవ‘ అనే స్టార్టప్‌ను ప్రారంభించారు. భారతదేశంలో ప్రస్తుతం పెరుగుతున్న ‘సైడ్ హజిల్‘ సంస్కృతికి ఇదొక నిదర్శనం. ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ లింక్స్‌ను సులభంగా మేనేజ్ చేసుకోవడానికి, తద్వారా ఆదాయాన్ని పెంచుకోవడానికి ఈ ప్లాట్‌ఫామ్ ఉపయోగపడుతుంది. డిజిటల్ టూల్స్ స్థానిక ఆర్థిక వ్యవస్థను ఏ స్థాయిలో మారుస్తున్నాయో ఈ స్టార్టప్ వృద్ధిని చూస్తే అర్థమవుతుంది. రూ. 1 కోటి క్లెయిమ్ - ఇండియాలో క్రియేటర్ టూల్స్ ట్రెండ్ రూ. 1 కోటి అనగానే అది మొత్తం లాభం అని అనుకుంటే పొరపాటే. ఇది ప్లాట్‌ఫామ్ ద్వారా జరిగిన మొత్తం సేల్స్ ను సూచిస్తుంది. అంటే, వివిధ క్రియేటర్లు ఈ ప్లాట్‌ఫామ్ ఉపయోగించి జరిపిన లావాదేవీల మొత్తం ఇది. స్టార్టప్‌కు వచ్చే అసలు ఆదాయం కేవలం ట్రాన్సాక్షన్ ఫీజులు, మంత్లీ సబ్‌స్క్రిప్షన్ల ద్వారా మాత్రమే వస్తుంది. కొత్తగా బిజినెస్ మొదలుపెట్టే ప్రతి భారతీయ యువ పారిశ్రామికవేత్త ఈ లెక్కలను స్పష్టంగా అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ రంగంలో భారత్ గ్లోబల్ హబ్‌గా మారుతోంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లలో క్రియేటర్ టూల్స్‌కు ఇప్పుడు విపరీతమైన డిమాండ్ ఉంది. డిజిటల్ ప్రొడక్ట్స్ అమ్మడానికి లేదా పెయిడ్ కన్సల్టేషన్ల కోసం వారు ఈ యాప్స్‌ను వాడుతున్నారు. సాధారణంగా ఇలాంటి ప్లాట్‌ఫామ్‌లు ప్రతి సేల్‌పై 5 నుంచి 10 శాతం వరకు ఫీజును వసూలు చేస్తాయి. వివరాలు వివరణ స్టార్టప్ పేరు రిపోర్ట్ చేసిన సేల్స్ 1 కోటి ఆదాయ రకం ప్లాట్‌ఫామ్ ఇలాంటి బిజినెస్ ప్రారంభించాలంటే పక్కా ప్లానింగ్, చట్టపరమైన ట్యాక్స్ నిబంధనల అవగాహన ఉండాలి. టర్నోవర్ నిర్దేశిత పరిమితి దాటినప్పుడు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అలాగే, ఫుల్ టైమ్ ఉద్యోగానికి రాజీనామా చేసే ముందే, మీ ఐడియాలను సైడ్ ప్రాజెక్ట్‌లుగా టెస్ట్ చేయడం ఉత్తమం. దీనివల్ల రిస్క్ తగ్గుతుంది. ఫౌండర్ సక్సెస్ స్టోరీ ఇంటర్నెట్ పవర్‌ను మరోసారి నిరూపించింది. ఇది ఎంతోమందికి సొంతంగా బిజినెస్ ప్రారంభించాలనే స్ఫూర్తినిస్తోంది. అయితే, కేవలం ఒక్క వైరల్ మూమెంట్‌తోనే విజయం రాదు, దీర్ఘకాలం రాణించాలంటే నిరంతర కష్టపడే తత్వం చాలా అవసరం.

# ముందు ఆ నిషేధం ఎత్తివేయండి తర్వాత చర్చలు గురించి మాట్లాడదాం



ట్రంప్‌కు ఇరాన్ దిమ్మతిరిగే షరతు అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు మరో కీలక మలుపు తిరిగాయి. ఇరాన్‌తో యుద్ధాన్ని నివారించేందుకు పాకిస్థాన్ వేదికగా జరుగుతున్న శాంతి చర్చలకు హాజరయ్యే విషయంలో టెహ్రాన్ అత్యంత కఠినమైన షరతును విధించింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా సైన్యం విధిస్తున్న నావికా దళ దిగ్బంధనాన్ని తక్షణమే ఎత్తివేస్తేనే తాము చర్చల బల్ల ముందుకు వస్తామని ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావానీ స్పష్టం చేశారు. అమెరికా ఒకవైపు కాల్పుల విరమణను పొడిగిస్తూనే.. మరోవైపు ఓడరేవులను దిగ్బంధించడం ‘యుద్ధ విరమణ నిబంధనలను ఉల్లంఘించడమే‘నని ఆయన అభివర్ణించారు. శాంతిని కోరితే తాము సిద్ధమని, ఒకవేళ యుద్ధమే కావాలనుకుంటే దానికి కూడా ఇరాన్ వెనకాడదని ఆయన హెచ్చరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పాకిస్థాన్ నాయకత్వం చేసిన విజ్ఞప్తి మేరకు కాల్పుల విరమణను నిరవధికంగా పొడిగిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, ఇరాన్ ఉన్నతాధికారుల నుండి మాత్రం వ్యతిరేక సంకేతాలే అందుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ సలహాదారు మహ్దీ మొహమ్మదీ అమెరికా వైఖరిని ఎద్దేవా చేస్తూ, “ఓడిపోతున్న పక్షం షరతులు విధించదు“ అని వ్యాఖ్యానించారు.కాల్పుల విరమణ ఒప్పందంపై ట్రంప్ కీలక ప్రకటన..హోర్ముజ్ జలసంధిని వదిలేది లేదంటూ ఇరాన్‌కు మరో వార్నింగ్.. మరోవైపు ఇస్లామాబాద్‌లో జరగాల్సిన ఈ చర్చలపై అనిశ్చితి నీడలు కమ్ముకున్నాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, వారి ప్రతినిధి బృందం పాకిస్థాన్ పర్యటనను వైట్ హౌస్ ప్రస్తుతానికి నిలిపివేసింది. అయినప్పటికీ, పాకిస్థాన్ ప్రభుత్వం మాత్రం శాంతి చర్చల కోసం అత్యున్నత స్థాయి భద్రతా ఏర్పాట్లు చేసింది. ఇస్లామాబాద్ మరియు రావల్పిండి పరిసర ప్రాంతాల్లో దాదాపు 20,000 మందికి పైగా భద్రతా సిబ్బందిని మోహరించింది. పాకిస్థాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ చేస్తున్న రాయబార ప్రయత్నాలు ఫలించాలంటే, అమెరికా దిగ్బంధనాన్ని సడలించాలని పట్టుబడుతోంది. ఈ పరిణామాలు గమనిస్తే, కాల్పుల విరమణ పొడిగించబడినప్పటికీ, దిగ్బంధనం కొనసాగినంత కాలం చర్చలు పట్టాలెక్కడం కష్టమనిపిస్తోంది. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఈ ‘మైండ్ గేమ్‘ అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# హోర్ముజ్ జలసంధిపై ట్రంప్ కీలక ప్రకటన

## ఒమన్ దేశాన్ని మిస్సైల్స్‌తో పేల్చేస్తామంటూ వార్నింగ్




మధ్యప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సరికొత్త గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరిపించేందుకు అమెరికా సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఇరాన్‌పై అమెరికా - ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన సైనిక చర్యల నేపథ్యంలో.. గత ఫిబ్రవరి నెలాఖరు నుండి ఇరాన్ ఈ కీలకమైన జలమార్గాన్ని దాదాపుగా మూసివేసింది. సాధారణంగా ప్రపంచవ్యాప్త చమురు సరఫరాలో ఐదో వంతు ఈ మార్గం గుండానే సాగుతుంది. దీని దిగ్బంధం వల్ల అంతర్జాతీయంగా తీవ్రమైన ఇంధన సంక్షోభం తలెత్తింది, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించే ప్రమాదం ఏర్పడటంతో అన్ని దేశాల్లోనూ ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఉత్కంఠభరిత వాతావరణంలో.. జలసంధి గుండా ప్రయాణించే ఓడలపై సంయుక్తంగా సుంకం (టారిఫ్) విధించేందుకు ఇరాన్ , ఒమన్ దేశాల మధ్య రహస్య చర్చలు జరుగుతున్నట్లు వార్తలు వచ్చాయి. అమెరికాకు సుదీర్ఘకాలంగా మిత్రదేశంగా ఉన్న ఒమన్‌ను తమ వైపు తిప్పుకుని, ఈ సుంకాల వసూలు యంత్రాంగానికి మద్దతు ఇచ్చేలా ఒప్పించాలని టెహ్రాన్ ప్రయత్నిస్తోందని ఒక ప్రాంతీయ అధికారిని ఉటంకిస్తూ అసోసియేటెడ్ ప్రెస్ ఇటీవల ఒక నివేదికను విడుదల చేసింది. ఈ పరిణామం వాషింగ్టన్‌కు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ఒక క్యాబినెట్ సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత నాటకీయమైన, కఠినమైన వ్యాఖ్యలు చేశారు. హోర్ముజ్ జలసంధి అనేది పూర్తిగా అంతర్జాతీయ జలాల్లో భాగమని, దానిపై ఎవరికీ ఏకపక్ష నియంత్రణ ఉండే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం నాటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ జలసంధి ప్రపంచ దేశాలన్నింటికీ అందుబాటులో ఉండబోతోందని, దీనిని ఎవరూ తమ ఆధీనంలోకి తీసుకోలేరని ప్రకటించారు. అమెరికా సైన్యం ఈ ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తుందని, ప్రస్తుత దౌత్యపరమైన చర్చలలో ఇది ఒక ముఖ్యమైన భాగమని ఆయన పేర్కొన్నారు అమెరికా ఆటలు సాగవిక.. ఇజ్రాయెల్‌ను భూమ్మీద లేకుండా నాశనం చేస్తాం.. దాడుల తర్వాత ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్.. అయితే, ఒమన్ దేశం ఇరాన్‌తో చేతులు కలపడంపై ట్రంప్ అసాధారణ రీతిలో స్పందించారు. ఒమన్ గనుక అంతర్జాతీయ నిబంధనల ప్రకారం మర్యాదగా ప్రవర్తించకపోతే, ఆ దేశాన్ని క్షిపణులతో పేల్చివేయడానికి కూడా వెనకాడబోమని ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఒమన్‌కు తమ బలం ఏంటో తెలుసని, వారు లొంగి ఉంటే క్షేమంగానే ఉంటారని వ్యాఖ్యానించారు. ఇరాన్ ఈ జలసంధిని నియంత్రించాలని చూస్తోందని, కానీ అమెరికా దానికి ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోదని ఆయన నొక్కి చెప్పారు. మరోవైపు, ఇరాన్‌తో ఒక శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఇటీవలి వారాల్లో ట్రంప్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. బుధవారం నాటి సమావేశంలో ట్రంప్ నేరుగా ఇరాన్‌పై వ్యూహాత్మక ఆరోపణలు చేశారు. అమెరికాలో రాబోయే నవంబర్ మధ్యంతర ఎన్నికల వరకు ఎలాగైనా సమయాన్ని వృధా చేయాలని, ఒప్పందాన్ని ఆలస్యం చేస్తూ “నా కోసం వేచి చూడాలని” ఇరాన్ ప్లాన్ చేస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికల ఫలితాలను బట్టి తమ తదుపరి అడుగులు వేయాలని టెహ్రాన్ భావిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో, అమెరికా అంతర్గత రాజకీయాల్లోనూ ఈ యుద్ధ వ్యూహంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వారాంతంలో ఇరాన్‌తో ఒక మైత్రి ఒప్పందం అంచున ఉన్నామని ట్రంప్ సంకేతాలు ఇవ్వడం రిపబ్లికన్ పార్టీలోని కఠిన నిర్ణయాలు కోరుకునే యుద్ధోన్మాద నాయకులకు నచ్చలేదు. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై యుద్ధానికి ఆదేశించాలన్న ట్రంప్ మునుపటి వివాదాస్పద నిర్ణయాన్ని గట్టిగా సమర్థించిన వారే, ఇప్పుడు ఆయనపై విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యంగా సెనేట్ సాయుధ సేవల కమిటీకి అధ్యక్షత వహిస్తున్న రోజర్ వికర్ సోషల్ మీడియా ద్వారా తన అసంతృప్తిని బహిర్గతం చేశారు. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న 60 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ ప్రతిపాదన ఒక పెద్ద విపత్తుగా మారుతుందని ఆయన హెచ్చరించారు. అమెరికా సైన్యం చేపట్టిన “ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ” ద్వారా ఇప్పటివరకు సాధించిన సైనిక విజయాలన్నీ ఈ విరామం వల్ల బూడిదలో పోసిన పన్నీరవుతాయని, శత్రువుకు కోలుకునే అవకాశం ఇచ్చినట్లవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తమ్మీద, హోర్ముజ్ శీట ఎశీతీఎబఓ చుట్టూ తిరుగుతున్న ఈ రాజకీయాలు అంతర్జాతీయంగా యుద్ధ మేఘాలను మరింత దట్టం చేస్తున్నాయి.



# అయిదుగురు హీరోయిన్లతో సినిమా?

గమ్యం, వేదం, కృష్ణంవందే జగద్గురుమ్, కంచె వంటి గొప్ప సినిమాలను తెరకెక్కించి అభిరుచి గల దర్శకుడిగా కితాబులందుకున్నారు దర్శకుడు క్రిష్ జాగర్లమూడి. సందేశాత్మక కథలకు వాణిజ్యఅంశాలను జోడించి జనరంజక చిత్రాలను అందించడం క్రిష్ ప్రత్యేకత. అయితే.. గత కొన్నేళ్లుగా క్రిష్ కెరీర్ సరైన ట్రాక్‌లో లేదు. ఎన్టీయార్ కథానాయకుడు, మహానాయకుడు, కొండపొలం, ఘాటీ చిత్రాల ఫలితాలు ఆయన కెరీర్‌పై తీవ్రమైన ప్రభావాన్నే చూపాయి. అందుకే.. గత వైభవాన్ని దక్కించుకునేందుకు ఈ సారి పకడ్బందీ వ్యూహంతో ముందుకెళు తున్నారట క్రిష్.

ఈ సారి కాస్టింగ్‌పై కాకుండా కథపైనే ఎక్కువ శ్రద్ధపెట్టి, ఓ విభిన్నమైన కాన్సెప్ట్‌ని ప్రేక్షకులకు అందించే ప్రయత్నాల్లో ఆయన బిజీగా ఉన్నారట. అయిదుగురు అమ్మాయిల నేపథ్యంతో కూడిన ఓ కథను ఆయన ప్రస్తుతం తెరకెక్కిస్తున్నట్టు తెలిసింది. ఈ అయిదు ప్రధాన భూమికలకు అయిదుగురు యంగ్ హీరోయిన్లను ఎంపిక చేసినట్టు వినికిడి. ఇప్పటికే ఎలాంటి హడావిడి లేకుండా చిత్రీకరణ కూడా మొదలైంది. క్రిష్ గత చిత్రాల మాదిరిగానే ఆలోచింపజేసే కథ, కథనాలతో ఈ సినిమా ఉంటుందట. ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రాజీవ్‌రెడ్డి, జాగర్లమూడి సాయిబాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



# పెద్ది మేకర్స్ అలర్ట్.. ఆ ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు..!

రామ్ చరణ్ పెద్ది మేకర్స్ రిలీజ్‌కు ముందు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మూవీ పైరసీ, లీక్ విషయంలో మద్రాస్ హైకోర్ట్‌ను ఆశ్రయించగా.. వీరికి అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు, పాటలు ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం, కాపీ చేయడాన్ని నిరోధిస్తూ న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. దీంతో ముందస్తు లీక్‌లు కాకుండా చర్యలకు మార్గం సుగమమైంది. తాజాగా పెద్దిపై అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలకు దిగింది. ఈ సినిమాపై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరిపై కేసు నమోదైనట్లు తెలుస్తోంది. గుంటూరు, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు కావాలనే నెగెటివ్ ప్రచారం చేస్తున్నట్లు పెద్ది టీమ్ దృష్టికి వచ్చింది. దీంతో పోలీసులకు మేకర్స్ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు సోషల్ మీడియా కార్యకలాపాలపై పెద్ది మూవీ టీమ్ కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. బుచ్చిబాబు డైరెక్షన్‌లో వస్తోన్న పెద్ది మూవీ జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.



# ఈ అభిమానం ఇలాగే ఉండాలి

శ్రద్ధాకపూర్ కొత్త రికార్డును నమోదు చేసింది. మే 2026 లెక్కల ప్రకారం ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లు కలిగిన కథానాయికగా ఆమె అవతరించింది. తాజాగా బయటకొచ్చిన అత్యధిక ఫాలోవర్లు కలిగిన టాప్ హీరోయిన్ల అధికారిక ఇన్‌స్టా జాబితాలో, మిగతా స్టార్ హీరోయిన్లందరినీ వెనక్కి నెట్టి, ఏకంగా 93 మిలియన్లు అనగా, 9కోట్ల 3లక్షల ఫాలోవర్లతో టాప్‌లో నిలిచింది శ్రద్ధాకపూర్. ఈ పోటీలో శ్రద్ధాకు.. ప్రియాంక చోప్రా గట్టి పోటీనే ఇచ్చింది. 92 మిలియన్ల ఫాలోవర్లతో ఆమె రెండో స్థానంలో నిలవడం విశేషం. ఈ విజయంపై ఇన్‌స్టా ద్వారా శ్రద్ధా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. ‘మీ అభిమానమే నాకు కొండంత బలం. ఈ అభిమానం కలకాలం ఇలాగే ఉండాలి’ అని పేర్కొన్నది. ఎప్పటికప్పుడు మారే ఈ నంబర్ల రేస్‌లో ఈసారి మాత్రం శ్రద్ధా కపూర్ నంబర్‌వన్ అనిపించుకుంది. వచ్చే ఏడాది ఈ స్థానంలో మరో హీరోయిన్ ఉండొచ్చు.



# విజయ్ దేవరకొండ బాలీవుడ్ చిత్రం?

పాన్ ఇండియా సినిమాల ద్వారా దేశవ్యాప్తంగా ప్రేక్షకులకు సుపరిచితుడయ్యారు అగ్రహీరో విజయ్ దేవరకొండ. తాజా సమాచారం ప్రకారం ఆయన తొలి హిందీ స్ట్రెయిట్ చిత్రానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిసింది. వైవిధ్య చిత్రాల దర్శకుడు విక్రమ్ కె కుమార్ డైరెక్షన్‌లో విజయ్ దేవరకొండ ఓ చిత్రాన్ని చేయబోతున్నారని గతకొంతకాలంగా వార్తలొస్తున్నాయి. యూవీ క్రియేషన్స్ ఈ సినిమా నిర్మాణం చేపట్టనుందని ప్రచారం జరిగింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని బాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మ్యాడ్‌డాక్ ఫిల్మ్స్ తెరకెక్కించనుందని సమాచారం. ఇటీవల ముంబయిలోని ఆ సినిమా ఆఫీసులో విజయ్ దేవరకొండ, విక్రమ్ కె కుమార్ ఇద్దరూ కనిపించడంతో ఈ వార్తలకు మరింతగా బలం చేకూరినట్లయింది. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నదని, ఓ యూనివర్సల్ కాన్సెప్ట్‌తో దర్శకుడు విక్రమ్ కె కుమార్ ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారని సమాచారం. అయితే ఈ విషయంలో స్పష్టత రావాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం విజయ్ దేవరకొండ ‘రణబాలి’ ‘రౌడీ జనార్ధన’ చిత్రాల షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ ఏడాదిలోనే ఇవి ప్రేక్షకుల ముందుకురానున్నాయి.

# ఈ ప్రేమకథ ‘రోమాంచకం’



అర్జున్ రెడ్డి, కబీర్‌సింగ్, యానిమల్ వంటి పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్స్‌ను అందించిన నిర్మాణ సంస్థ భద్రకాళీ పిక్చర్స్ తెరకెక్కిస్తున్న తాజా తెలుగు చిత్రానికి ‘రోమాంచకం’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అగ్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పకుడిగా వ్యవహరిస్తున్న ఈ చిత్రాన్ని ఆయన సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ సినిమా ద్వారా వేణుగోపాల్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. శుక్రవారం ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. యూత్‌ఫుల్ అండ్ పొయెటిక్ ఫీల్‌తో పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే ట్యాగ్‌లైన్ కథపై ఆసక్తినిరేకెత్తిస్తున్నది. నవ్యత కలబోసిన ప్రేమకథా చిత్రమిదని, త్వరలో మరిన్ని అప్‌డేట్స్ అందిస్తామని మేకర్స్ తెలిపారు. ఉపేంద్ర లిమయె, వెంకటేష్ కాకుమాను, నరేంద్ర రవి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వాసుకి వైభవ్, సమర్పణ: సందీప్‌రెడ్డి వంగా, నిర్మాత: ప్రణయ్ రెడ్డి వంగా, రచన-దర్శకత్వం: వేణుగోపాల్ రెడ్డి.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.